ప్రజాశక్తి
విజయనగరం

సోమవారం
జనవరి 1
2018
పేజీలు 12

కోటి ఆశలకు స్వాగతం..!



'కష్టాలు, కన్నీళ్లను జ్ఞాపకాలు పుటల్లోదా చేసి... కొత్తకొత్త ఆశలు చిగురింపజేస్తూ వచ్చేసింది నూతన సంవత్సరాది. ప్రజలంతా కోటి ఆకాంక్షలతో 2018కి స్వాగతం పలికారు. గడిచిన అర్ధరాత్రితో 2017 సంవత్సరం కరిగి కాలగర్భంలో కలిసిపోయింది. సంవత్సరాలు ఎంత హుషారుగా వస్తాయో, అంతే నిశ్శబ్దంగా వెనక్కి జారుకుంటాయి. అనుభవాలు, గుణపాఠాలు మిగిలిపోతాయి. అనుభవాలు ఇచ్చిన ఆనందం.. గుణపాఠం అందించిన విజ్ఞానానికి తోడు చేసుకుని 2018లో అడుగు పెట్టేశాం. కొత్త అంటే అంతులేని ఆశకదా..? అందుకే కొత్త ఎనిమిది ఎలా ఉంటుందో తెలియకపోయినా జిల్లా ప్రజలంతా ఉత్సాహంతో సాదరంగా స్వాగతిస్తున్నారు.'

అందరికీ శుభం కలగాలి



జిల్లా ప్రజలకు 2018నూతన సంవత్సర శుభాకాంక్షలు. ఈ నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలందరికీ శుభ కలగాలి. సుఖశాంతులంతో ప్రజలంతా జీవించాలి. జిల్లా అభివృద్ధి పథంలో నడవాలి.

- కేంద్రమంత్రి అశోక్‌గజపతిరాజు

ప్రతిఒక్కరూ జీవితాలు సుఖశాంతులు నిండాలి



నూతన సంవ్సతరం ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖశాంతులు నిండాలి. జిల్లా సౌభాగ్యం మరింతగా వెల్లువిరియాలి. 2018లో జిల్లా అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తుందని ఆకాంక్ష.

- మంత్రి సుజయ్‌కృష్ణరంగారావు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్రమంత్రి సుజయ్‌కృష్ణ రంగారావు

4 లో

20 నాటికి బిల్లులు చెల్లించకుంటే చర్యలు

జెడ్‌పి సమావేశంలో మంత్రి సుజయ్‌కృష్ణ

జెడ్‌పిలో అధికారులకు అవమానం

- ఏకవచనంతో సభ్యులు, ఎమ్మెల్యేల ఆగ్రహం.. అవినీతి ఆరోపణలు
- తీవ్రంగా పరిగణించిన అధికారుల సంఘం
- జెసి-2 ఆధ్వర్యాన అత్యవసర సమావేశం
- నేడు కలెక్టర్‌కు ఫిర్యాదు
- 'జన్మభూమి'లో పాల్గొనడంపై కొనసాగుతున్న చర్చ



జిల్లా అధికారుల సమావేశంలో పాల్గొన్న జెసి-2

4 లో

ఆదాయమే ధ్యేయంగా..!

2 లో

కాసేపట్లో ఇంటికి చేరుకుంటారనగా...

3 లో

ప్రభుత్వ వైద్య కళాశాల, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

12 లో



నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

మత్స్యకారులను ఎస్‌టిల్లో చేర్చాలని నిరసన

ప్రజాశక్తి-కంటోన్మెంట్

మత్స్యకారులను ఎస్‌టిలో చేర్చాలని మత్స్యకారుల సాధన సమితి ఆధ్వర్యాన జెడ్‌పి కార్యాలయం వద్ద ఆదివారం నిరసన తెలిపారు. అనంతరం మంత్రి సుజయకృష్ణ రంగారావుకు వినతి అందించారు. 14 రాష్ట్రాల్లో మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్చారని, ఇక్కడ ఈ ప్రక్రియ కొనసాగడం లేదని సాధన సమితి సభ్యులు మంత్రికి వివరించారు. దీనిపై ప్రభుత్వంతో మాట్లాడి, మత్స్యకారులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు అప్పారావు, శేఖర్, సత్తిబాబు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ చంద్రకళాధర్ వేసిన చిత్రం

నూతన సంవత్సరానికి ఆకాంక్షల ఆకృతులతో స్వాగతం

ప్రజాశక్తి-విజయనగరం

నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ తెలుగు భాషా పరిరక్షకుడు మక్కువ చంద్రకళాధర్ చార్టులపై రంగులతో రూపొందించిన ప్రజల ఆకాంక్షల ఆకృతులు అందరినీ ఆకట్టుకున్నాయి. నూతన సంవత్సరం 2018ను ఉదయిస్తున్న సూర్యునిగా, ప్రజల ఆకాంక్షలను కిరణాలుగా... 2018ను వికసించే పువ్వుగా, ప్రజల ఆకాంక్షలను రేకులుగా... 2018ను వెలుగుతున్న దీపంగా, ప్రజల ఆకాంక్షలను కాంతులుగా రంగులతో చార్టులపై చిత్రీకరించారు. ప్రజలందరికీ ఆరోగ్యం, ఐశ్వర్యం, ఆనందం, విజ్ఞానం, విజయం, శుభం, లాభం చేకూరాలని ఆయన ఆకాంక్షించారు.

యుటిఎఫ్ క్యాలెండరు ఆవిష్కరణ

ప్రజాశక్తి-గజపతినగరం

స్థానిక ఎంఇఒ కార్యాలయంలో యుటిఎఫ్ క్యాలెండరు, డైరీలను ఎంఇఒ విమలమ్మ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం ఉపాధ్యాయుల సమస్యలపై యుటిఎఫ్ పోరాటం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు జి.వి.నారాయణ, అల్లు శంకరరావు, బంగార్రాజు, ఎ.వి.రవికుమార్, ఆర్.మురళి, వి.లక్ష్మునాయుడు తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండరును ఆవిష్కరిస్తున్న ఎంఇఒ విమలమ్మ, యుటిఎఫ్ నాయకులు

ఆదాయమే ధ్యేయంగా..

- మార్చి వరకు బిపిఎస్ దరఖాస్తుల గడువు పెంపు
- మూడేళ్లుగా కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఆదాయమే ధ్యేయంగా అక్రమ భవనాల క్రమబద్ధీకరణ (బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్)ను పొడిగిస్తూ వస్తోంది. బిపిఎస్‌ను తెలుగుదేశం ప్రభుత్వం 2015 మే నెలలో ప్రారంభించింది. ఆ రోజు నుంచి నేటి వరకు బిపిఎస్ దరఖాస్తులకు గడువు పెంచుతూ వస్తున్నారు.

కేవలం అక్రమ పద్ధతిలో భవనాలు నిర్మించుకునే వారు క్రమబద్ధీకరించుకునేందుకు బిపిఎస్‌ను ప్రారంభించారు. జిల్లాలో 2015 మేలో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించినప్పుడు మూడు నెలల్లో బిపిఎస్ దరఖాస్తులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అప్పటి నుంచి ప్రతి మూడు నెలలకు గడువును పెంచుతూ మూడేళ్లయినా అక్రమ భవనాల క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి కాలేదు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరి కారణంగా మూడు సంవత్సరాల కాలంలో అధికార పార్టీ అండతో అనేక అక్రమ భవనాలను నిర్మించుకునే వారంతా మళ్లీ బిపిఎస్ దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం లభించింది. విజయనగరం పురపాలక



మున్సిపల్ కార్యాలయం

సంఘంలో బిపిఎస్ ప్రారంభమైన తర్వాత 1070 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో మూడు సంవత్సరాల కాలంలో 957 దరఖాస్తులను పరిష్కరించారు. ఫలితంగా విజయనగరం పురపాలక సంఘానికి ఇంత వరకు బిపిఎస్ ద్వారా రూ.10.85 కోట్ల ఆదాయం వచ్చింది. ఇంకా 113 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండిపోయాయి. మిగిలిన దరఖాస్తులను కూడా గతేడాది 2017 డిసెంబరు 31వ తేదీలోపు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అందుకు అనుగుణంగా ఇటీవల విజయనగరం పురపాలక సంఘానికి ప్రణాళికా విభాగం డిడి వచ్చి సమీక్షా సమావేశం నిర్వహించి, పట్టణ ప్రణాళిక సిబ్బందిని ఆదేశించారు. అప్పటికి సుమారుగా 190 వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. డిసెంబర్ మొదటి వారంలో సమీక్ష చేపట్టగా, నెలాఖరు నాటికి సుమారుగా 77 దరఖాస్తులు పరిష్కరించారు. ఇంకా 113 దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా బిపిఎస్ దరఖాస్తులు వేల సంఖ్యలో పెండింగ్‌లో ఉండిపోవడంతో కోట్లాది రూపాయల ఆదాయం వచ్చే అవకాశాలు ఉండటంతో మళ్లీ మార్చి నెలాఖరు వరకు గడువును పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం ప్రకటించింది. దీంతో మరో మూడు నెలల కాలం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి మార్గం సుగమం కానుంది. పెండింగ్‌లో ఉన్న 113 దరఖాస్తులు పరిష్కరిస్తే విజయనగరం పురపాలక సంఘానికి సుమారుగా రెండు కోట్ల రూపాయల వరకు ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రణాళికా విభాగం అధికారులు చెబుతున్నారు.

నిర్లక్ష్యమే పరిష్కారానికి ఆటంకం

మూడేళ్లలో పెండింగ్‌లో ఉన్న బిపిఎస్ దరఖాస్తుల పరిష్కారం కాకపోవడానికి పాలకులు, అధికారులు నిర్లక్ష్యమే స్పష్టంగా కనిపిస్తుంది. కేవలం బిపిఎస్‌ను ప్రకటించిన తర్వాత ప్రజల్లో దీనిపై అవగాహన కల్పించే కార్యక్రమాలు సక్రమంగా అమలు చేయలేదు. మార్చి వరకు పెంచిన గడువులోగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు పరిష్కరిస్తారో, లేదో వేచి చూడాల్సిందే.

ప్రభుత్వ సంస్థల ప్రయివేటీకరణ తగదు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : ఎపి ఎన్‌జిఒ సంఘం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సంస్కరణల పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుపరం చేయడం సరికాదని, తక్షణమే ప్రభుత్వం ఇటువంటి నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఎపి ఎన్‌జిఒ సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక ఎన్‌జిఒ హోంలో జిల్లా అధ్యక్షులు బిహెచ్‌ఎస్ఆర్ ప్రభుజీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి విస్తృత సమావేశం జరిగింది. సమావేశంలో పిఆర్‌సి 18 నెలల బకాయిలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న డిఎ తక్షణమే మంజూరు చేయాలని, ఆరోగ్య కార్డులు పూర్తిస్థాయిలో వినియోగమయ్యేలా చూడాలని, వైద్య ఆరోగ్యశాఖలో, ఐటిడిఎ శాఖల్లో కాంట్రాక్టు ఉద్యోగులకు పిఆర్‌సి వర్తింప చేయాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని, కాంట్రాక్టు



నూతనంగా ఎన్నికైన వారితో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న రాష్ట్ర నాయకులు

ఉద్యోగుల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని సమావేశంలో తీర్మానాలు చేశారు. సమావేశంలో ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వి.రమణ, రాష్ట్ర నాయకులు రవిశంకర్ పాల్గొన్నారు.

అనంతరం జిల్లా అసోసియేషన్‌లో ఏర్పడిన ఖాళీ పోస్టుల్లో జిల్లా సహాధ్యక్షులుగా జె.మరళి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎం.చక్రధరరావు, ఉపాధ్యక్షులుగా కె.వర్మరాజు, జాయింట్ కార్యదర్శిగా కె.కృష్ణమోహన్‌ను ఎన్నుకున్నారు. అనంతరం వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు.

దళితుల సమస్యలపై 'జన్మభూమి'లో నిలదీయాలి

శృంగవరపుకోట : ఈ నెల రెండో తేదీ నుంచి నిర్వహించే జన్మభూమి కార్యక్రమంలో దళితుల సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులను నిలదీయాలని సమాచార హక్కు సంఘం ఉత్తరాంధ్ర అవగాహన సంఘ సభ్యులు కొత్తల గౌరినాయుడు కోరారు. ఆదివారం మండలంలోని కొట్టాం, ధర్మవరం, కృష్ణాపురం, తిమిడి గ్రామాల్లోని ఎస్‌సి కాలనీల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ దళిత కాలనీల్లో రోడ్లు, మురుగు కాలువలు లేక ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో పది ఎకరాల భూమి ఉన్న వారికి కూడా ప్రభుత్వం పింఛను మంజూరు చేస్తున్నా. కూడు, గూడు లేని దళితులకు మాత్రం సంక్షేమ పథకాలు అందించడం లేదని విమర్శించారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-గజపతినగరం

కల్లుగీత కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొలుసు సత్యం డిమాండ్ చేశారు. ఆదివారం గజపతినగరంలో గీత కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గీత కార్మికులకు గుర్తింపు కార్డుల ఆధారంగా 50 శాతం సబ్సిడీపై రూ.నాలుగు లక్షల వరకు రుణాలు ఇవ్వాలని కోరారు. రుణ వయసు పరిమితిని 60 ఏళ్లకు పెంచాలన్నారు. రుణాల పేరుతో గీత కార్మికులను దోపిడీ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హుదూద్ తుపాను సంభవించి మూడేళ్లు గడిచినా నేటికీ పరిహారం అందించక



మాట్లాడుతున్న సత్యం

పోవడం శోచనీయమన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని దశల వారీగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని కల్లు గీత కార్మికులు పాల్గొన్నారు.

'జన్మభూమి'ని జయప్రదం చేయండి : ఎంపిపి

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

జన్మభూమి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిపి హరిప్రియా థ్రాట్రాజ్ అన్నారు. ఆదివారం స్థానిక మండలపరషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయితీ సెక్రటరీలు, అన్ని శాఖల మండల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 5వ జన్మభూమి-మా ఊరులో ప్రతి ఒక్కరు పాల్గొవాలన్నారు. మండలంలోని 2018 జనవరి 2 నుండి 11 వరకు ప్రతి పంచాయతీలో జన్మభూమి-మా ఊరు నిర్వహిస్తామన్నారు. తహశీల్దార్, ఎంపిడిఒలు వేరు వేరుగా టీములు వేశామన్నారు. కుటుంబం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి హరిప్రియా థ్రాట్రాజ్

వికాసం-సమాజ వికాసం అనే నినాదాన్ని ప్రభుత్వం సూచించిందన్నారు. 2న అడ్డాపుశీల, గోపాలపురం 3వ తేదిన బుదురువాడ, గోచెక్క, డోకిశీల, తాళ్లబురిడి, 4వ తేదిన చినబొండపల్లి, ఎల్ఎన్‌పురం ఎంఆర్‌నగరం, వెంకంపేట 5వ తేదిన క్రిష్ణపల్లి, పెదమరికి, 6వ తేదిన కవిటిభద్ర, ములగ, గంగాపురం 7వ తేదిన సంగంవలస, పుట్టూరు 8వ తేదిన పెదబొండపల్లి, సుడిగాం, 9వ తేదిన జమదాల, జమ్మిడివలస, బందలుప్పి, పులిగుమ్మిలో కార్యక్రమం ఉంటుందన్నారు. 10వ తేదిన నర్సిపురం, 11వ తేదిన వెంకట్రాయుడు పేట, బాలగుడబ గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలు ఇచ్చిన వినతులపై దృష్టి సారించాలని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. కార్యక్రమములో ఎంపిడిఒ కె.కృష్ణారావు, ఇఓపిఆర్‌డి రాధకృష్ణ, ఎఎస్ఓ ఎం.భానుమూర్తి, బి.సి బాలుర వసతిగృహ సంక్షేమాధికారి టిఎస్ఆర్.శర్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువతలో ప్రతిభ వెలికితీయాలి

ప్రజాశక్తి-కురుపాం

క్రీడల ద్వారా యువతలో ప్రతిభను వెలికితీయాలని ఎస్ఐ వి.బాలాజీరావు తెలిపారు. ఆదివారం డప్పుల వీధిలో కురుపాం పోలీసుల ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ పోటీల ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడల ద్వారా శారీరక ధారుడ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కె.రంజిత్‌కుమార్, జెడ్‌పిటిసి సభ్యులు ఎ.కోటేశ్వరావు, బ్యాంకు మేనేజర్ పి.సత్యనారాయణ, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి తదితరుల పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలో క్షణకాలంలో పెను ప్రమాదం తృటిలో తప్పింది. శనివారం రాత్రి పట్టణంలోని బెలగాం గూడ్స్‌షెడ్ రోడ్డు మలుపు వద్ద క్వారీ లారీ అదుపు తప్పి దుర్గాగుడిని ఢీకొని బోల్తాపడింది. అయితే ఆ సమయంలో ఈ రహదారి గుండా పాదచారులు, వాహనచోదకులు రాకపోకలు సాగించకపోవడంతో ప్రమాదం తప్పింది. గొట్టివలస క్వారీ నుండి విశాఖపట్నానికి 10 ఎంఎం రాయితో వెళ్తున్న లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు అంటున్నారు. ఈ ఘటనలో గూడ్స్‌షెడ్ రోడ్డు నిర్వాసితులు భయభ్రాంతులకు గురయ్యారు.

మరోచోట స్తంభించిన ట్రాఫిక్

పట్టణంలోని కొత్తవలస రైల్వేగేటును ఢీకొన్ని సంఘటనలో ట్రాఫిక్ స్తంభించింది. ఆదివారం పాలకొండ నుండి పార్వతీపురం వస్తున్న ఆర్‌టిసి బస్సు ప్రమాదవశాత్తూ కొత్తవలస టౌన్ రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వే గేటు వేసివున్న సమయంలో ఢీకొంది. దీంతో గేటు విరిగిపోవడంతో ఎక్కడ వాహనాలు అక్కడ ఆగిపోయాయి. దీంతో స్థానికులు, రైల్వే అధికారులు, సిబ్బంది, పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

రైతుబజార్ ధరలు (నిన్నటి రేట్లు, కిలోకు)



కూరగాయలు	ధర (రూపాయల్లో)
వంగ (తెలుపు)	26
వంగ (రవ్వ)	30
వంగ (నలుపు)	26
టమాటా దేశవాళి	12
టమాటా హైబ్రిడ్	12
బెండ	35
కాకర	25
బీర	37
క్యాబేజీ	20
పొడుగు చిక్కుడు	26
క్యారెట్	38
దొండ	26
బీట్‌రూట్	32
ఉల్లిపాయలు	39
బంగాళాదుంపలు	8
అల్లం	35
పచ్చిమిర్చి	28
వెల్లుల్లి	38
గోరుచిక్కుడు	23
మునక్కాడలు	65
కాప్సికమ్	40
కీరదోస	23
నక్కదోస	23
కంద	27
చామ	24
ఫ్రెంచ్ బీన్స్	45
పొటల్స్	34
అకాకర	50

నిబంధనలు పాటించకపోతే చర్యలు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్ఐ జ్ఞానప్రసాద్ తెలిపారు. ఆదివారం వెంకంపేట గోరీల వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనం నడుపుతున్న వారి నుండి పత్రాలు అడిగి పరిశీలించారు. హెల్మెట్ లేనివారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనం నడిపినప్పుడు తప్పనిసరిగా అన్ని పత్రాలు ఉంచాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడపరాదన్నారు. ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని, అజాగ్రత్తతో వాహనం నడపడంతో ఎన్నో ప్రమాధాలు జరుగుతున్నాయన్నారు. దీని వల్ల చాలా కుటుంబాలు వీధిన పడతున్నాయని, అంగవైకల్యం కావడంతో జీవితాలు నాశనం అవతున్నాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌సి ఎల్.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

'వనమూలికలతో ప్రయోజనం'

ప్రజాశక్తి-కురుపాం

ప్రకృతిలో లభించే వన మూలికల ద్వారా అనేక ప్రయెజనాలున్నాయని వన మూలికల ఏజెన్సీ సంఘం ప్రతినిధి బి.భాస్కరరావు తెలిపారు. ఆదివారం బొడ్డమానుగూడలో పురాతల మూలికల వైద్యంపై గిరిజనులకు అవగాహన కార్యకమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన మూలికలతో ఏ వ్యాధికైనా దూరం చేయవచ్చన్నారు·

పాత నేరస్తుల అరెస్టు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

నెల్లిమర్ల, గుర్ల, గంట్యాడ, డెంకాడ పోలీస్‌స్టేషన్ ఏరియాలో ఈ మధ్యకాలంలో పలు దొంగతనాలకు పాల్పడిన పాత నేరస్తులు కె.వెంకటరమణ, ఎస్.నాగరాజును నెల్లిమర్ల వద్ద పోలీసులు అరెస్టు చేశారు. సిసిఎస్ డిఎస్‌పి చక్రవర్తి, సిబ్బందికి వచ్చిన సమాచారం మేరకు నెల్లిమర్ల ఎస్ఐ తన సిబ్బందితో కాపుకాసి పాత నేరస్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుండి ఆరు కేసులకు సంబంధించి 12 తులాల బంగారు ఆభరణాలు, అర కిలో వెండి వస్తువులు, రూ.5 వేలు నగదు, రూ.3 లక్షలు విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద నిర్వహించిన సమావేశంలో వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో విజయనగరం రూరల్ సిఐ లక్ష్మణరావు, సిసిఎస్ ఎస్ఐ సన్యాసిరావు, ఎస్ఎస్ నాయుడు, ఉపేంద్ర, నాగేంద్రకుమార్, టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్



మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కాసేపట్లో ఇంటికి చేరుకుంటారనగా...

గుర్ల : పని ముగించుకొని మరి కాసేపట్లో ఇంటికి చేరుకుంటామనుకొనేసరికి ఆర్టీసీ బస్సు వారికి పాలిట మృత్యుశకటంగా మారింది. వీరి మృతితో ఆ రెండు కుటుంబాలు కన్నీరుమున్నీరైన విషాద సంఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించిన విరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. మృతులు ఒకరు గుర్లకు చెందినవారు కాగా ఇంకొకరు కోటగండ్రేడుకు చెందినవారు. మృతుల్లో వంక శ్యామ్(18), పొట్నూరు ప్రసాద్(26) ఈ ఘటనలో మృతిచెందారు. విజయనగరం నుండి బైక్‌పై ప్రసాద్, శ్యామ్ కలిసి వస్తుండగా పాలకొండ నుండి విజయనగరం వెళ్తున్న ఆర్‌టిసి బస్సు ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. వారి ఇద్దరు గుజ్జంగివలస సమీపంలో ఇటుక బట్టీల వద్ద పనిచేస్తున్నారు. వీరిద్దరూ మరికొద్ది సేపట్లో ఇంటికి చేరుకుంటారనే సమయాన మృత్యువు కబలించింది. గుర్ల ఎస్ఐ రవి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను చీపరుపల్లి ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుల కుటుంబ సభ్యులు రోధిస్తున్నారు. కేసును ఎస్ఐ దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

తెర్లాం : అక్రమంగా బెల్ట్‌షాపునకు తరలిస్తున్న మద్యం సీసాలను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం నెమలాం మద్యం షాపు నుంచి లోచర్ల బెల్ట్ దుకాణానికి మద్యాన్ని తరలిస్తున్నారన్న సమాచారంతో వి.చిన్నయ్యపేట జంక్షన్ వద్ద తనిఖీలు చేశామని చెప్పారు. ఈ సమయంలో మద్యాన్ని తరలిస్తున్న గుల్ల పైడిరాజుతోపాటు మరో వ్యక్తిని పట్టుకున్నారు. వారి నుంచి 100 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా మద్యం తరలించినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని ఎస్ఐ హెచ్చరించారు. బెల్ట్‌షాపులు నిర్వహిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. బెల్ట్‌షాపునకు మద్యాన్ని సరఫరా చేసిన మద్యం దుకాణానికి పోలీసులు నోటీసులు ఇచ్చారు.

ఎక్సైజ్ అధికారుల ఉదాసీనతతోనే బెల్ట్‌షాపులు

బెల్ట్‌షాపులపై ఎక్సైజ్ అధికారులు ఉదాసీనతగా వ్యవహరించడంతోనే మండలంలో బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారు. బెల్ట్‌షాపులను ప్రభుత్వం నిషేధించినప్పటికీ అధికార పార్టీకి చెందిన నాయకులే మద్యం వ్యాపారం చేయడంతో వీటిని ప్రోత్సహిస్తున్నారని తెలుస్తోంది. వీటిపై ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో సివిల్ పోలీసు లకు సమాచారమందించడంతో అక్రమంగా తరలి స్తున్న మద్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేశారు. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు స్పందించి బెల్ట్‌షాపులుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

మొదటి పేజీ తరువాయి

కోటి ఆశలకు స్వాగతం

జిల్లా అభివృద్ధిలో పాలుపంచుకోవాలి



జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ శోభా స్వాతీరాణి

జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. ఈ ఏడాది ప్రజలంతా సుఖసంతోషాలతో మెలగాలి. జిల్లా అభివృద్ధికి అంతా పాలుపంచుకోవాలి.

ప్రజలందరికీ మంచి జరగాలి

కలెక్టర్ వివేక్‌యాదవ్



జిల్లా ప్రజలకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు. ఈ నూతన సంవత్సరంలో ప్రజాప్రతినిధులకు, జిల్లా యంత్రాంగానికి, అధికారులకు, అనధికారులకు, ప్రజలకు మంచి జరగాలి. అధికారులకు విధి నిర్వహణలో విజయం కలగాలి. విద్యార్థులకు మంచి భవిష్యత్ కలగాలి. నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించాలి. రైతులకు మంచి జరగాలి. జిల్లా అభివృద్ధికి, సంక్షేమ పథకాల అమలుకు ప్రజలంతా భాగస్వాములై జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడానికి సహకరించాలి.

సుఖసంతోషాలతో జీవించాలి

ఎస్పీ జి.పాలరాజు



నూతన సంవ్సతరంలో అడుగుపెడుతున్న జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి. శాంతి భద్రతలు పరిడవిల్లాలి. వెనుకబడిన జిల్లాగా ఉన్న విజయనగరం 2018లో అభివృద్ధి పథంలో దూసుకోవాలి. ప్రతి ఒక్కరూ అందుకు తగ్గట్టు కృషి, పట్టుదలతో పని చేయాలి.

రహదారులకు మోక్షమెప్పుడు?

గజపతినగరం : నియోజకవర్గంలో ముఖ్యమైన రహదారులకు మోక్షం ఎప్పుడు లభిస్తుందని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు దేవర ఈశ్వరరావు ప్రశ్నించారు. ఆదివారం గజపతినగరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గజపతినగరంలో ఎంపిడిఒ కార్యాలయం, మరుపల్లిలో పిహెచ్‌సికి వెళ్లే రహదారులు అధ్వానంగా ఉన్నాయని తెలిపారు. గజపతినగరంలోని ప్రధాన రహదారులతోపాటు లింగాలవలస – కెంగువ రహదారులు అధ్వాన స్థితికి చేరాయని వివరించారు. ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారుల దుస్థితిపై ప్రజాప్రతినిధులు స్పందించడం లేదని విమర్శించారు. రైల్వే గేటు– పురిటిపెంట మధ్య అనుమతులు లేకుండా గోతులు తవ్వడం ఆపాలన్నారు. రహదారులకు మోక్షం కలిగించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి డి.దేవుడునాయుడు, పట్టణ అధ్యక్షులు కె.అప్పలాచారి పాల్గొన్నారు.



ప్రజాశక్తి ప్రచురించి కార్యాలయ క్యాలెండర్‌ను స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో రాష్ట్ర గనులశాఖ మంత్రి ఆర్‌విఎస్‌కె రంగారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రజాశక్తి సిబ్బందికి, యాజమాన్యానికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. క్యాలెండర్‌ను ఆవిష్కరించిన వారిలో జెడ్పీ చైర్‌పర్సన శోభా స్వాతీరాణి, ఎమ్మెల్యేలు పతివాడ నారాయణస్వామినాయుడు, మీసాల గీత, ప్రజాశక్తి కన్వీనర్ కె.రమేష్‌నాయుడు, డెస్క్ ఇన్‌ఛార్జి పి.అప్పారావు, ఎడివిటి జిల్లా ఇన్‌ఛార్జి సిహెచ్.రాము, స్టాఫ్‌రిపోర్టర్ వి.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

-ప్రజాశక్తి, కంటోన్మెంట్

20 నాటికి బిల్లులు చెల్లించకపోతే చర్యలు

లిఖితపూర్వక ఫిర్యాదు చేస్తే ప్రోటోకాల్‌పై విచారణ : కలెక్టర్

బిల్లులు చెల్లించకపోతే తర్వాత సమావేశాలను బహిష్కరిస్తాం : స్వపక్ష ప్రజాప్రతినిధుల హెచ్చరిక

రూ.352.64 కోట్లతో అంచనా బడ్జెట్

ప్రజాశక్తి - కంటోన్మెంట్

జిల్లాలోని పలు పథకాల కింద చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులేవీ మంజూరు చేయలేదని, దీంతో పనులేవీ చేయలేకపోతున్నామని తక్షణమే బిల్లులు చెల్లించాలని అధికార పార్టీకి చెందిన గజపతినగరం ఎమ్మెల్యే కెఎ నాయుడు, పలువురు జెడ్పీటిసి సభ్యులు, ఎంపిపిలు రాష్ట్ర గనుల శాఖ మంత్రి సుజయ్‌కృష్ణ రంగారావును కోరారు. ఆదివారం స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ శోభా స్వాతీరాణి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అధికారుల తీరుపై ప్రతిపక్ష సభ్యుల కన్నా స్వపక్ష సభ్యులే తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పంచాయతీరాజ్ అధికారుల తీరుపై ఒకానొక సమయంలో కెఎ నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రెండేళ్లక్రితం పూర్తయిన పనులకు నేటికీ బిల్లులు చెల్లించలేదని, అడిగితే రోజు రోజుకు వాయిదా వేస్తున్నారని అన్నారు. గత సమావేశంలో రానున్న సమావేశం నాటికి పూర్తిగా బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చారని, అయితే ఇప్పటికీ బిల్లులు చెల్లించలేదని తెలిపారు. దీనిపై పంచాయతీరాజ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనికి మంత్రి సుజయకృష్ణ రంగారావు కలుగజేసుకొని జనవరి 20తేదీలోగా నూరుశాతం బిల్లులు చెల్లించాలని, లేనిపక్షంలో అధికారులపై శాఖాపరమైన కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇదే విషయమై జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ గత రెండేళ్లుగా ఎన్‌ఆర్‌ఇజిఎస్ కింద చేపట్టిన రోడ్డు పనుల్లో జిల్లా ముందంజలో ఉందని, కానీ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ ఏడాది ఆఖరు స్థానానికి పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు ఇలాగే వ్యవహరిస్తే పనులు చేసేందుకు ఎవరూ ముందుకురారని, గడువులోగా బిల్లులు చెల్లించకపోతే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. జెడ్పీ వైస్‌ఛైర్మన్ బలగం కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలకు అధికారులు ప్రోటోకాల్ పాటించడంలేదని, కనీసం ఎమ్మెల్యేలకు కూడా చెప్పడంలేదని ఫిర్యాదు చేశారు. ప్రోటోకాల్‌పై పలుమార్లు ఫిర్యాదు చేసినా కలెక్టర్ స్పందించడంలేదని తెలిపారు. దీనికి కలెక్టర్ వివేక్‌యాదవ్ స్పందిస్తూ ఈ విషయమై లిఖితపూర్వంగా ఫిర్యాదు చేస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎమ్మెల్సీ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ జిల్లాలో అవినీతి భారీస్థాయిలో జరుగుతుందని దీనిపై ఏం చర్యలు తీసుకుంటారని ప్రశ్నించారు. సాలూరు ఎమ్మెల్యే పి.రాజన్నదొర మాట్లాడుతూ సమావేశాన్ని సకాలంలో నిర్వహించాలని కోరారు. అనంతరం కొత్త సంవత్సరం కేక్‌ను మంత్రి కట్ చేశారు.



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే, సభ్యులు

రూ.352.64కోట్లుతో అంచనా బడ్జెట్

అనంతరం 2018–19 ఆర్థికసంవతసరానికి గానూ రూ.352.64కోట్లు అంచనాతో బడ్జెట్‌ను జెడ్పీ సిఇఒ బి.వెంకటేశ్వరరావు ప్రవేశపెట్టగా, దీన్ని చైర్‌ఫర్సన్‌తో పాటు సభ్యులు ఆమోదించారు. ఈ బడ్జెట్‌లో వివిధ శాఖల కేటాయింపులను సిఇఒ వివరించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పతివాడ నారాయణస్వామినాయుడు, మీసాల గీత, బొబ్బిలి చిరంజీవులు, ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, పలువురు జెడ్పీటిసి సభ్యులు, ఎంపిపిలు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన సభ్యులు

జెడ్‌పిలో అధికారులకు అవమానం

ప్రజాశక్తి – విజయనగరం ప్రతినిధి

జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్, జిల్లాకు చెందిన రాష్ట్ర గనుల శాఖ మంత్రి సుజయ్‌కృష్ణ సాక్షిగా జిల్లా అధికారులకు అవమానం జరిగింది. పలువురు జెడ్పీటిసి సభ్యులతో పాటు గజపతినగరం ఎమ్మెల్యే కెఎ నాయుడు ఏక వచనంతో దుర్భాషలాడారు. ఒకానొక సందర్భంలో ఎమ్మెల్యే నాయుడు 'బయటకు రా నీ సంగతి తేలుస్తా..! అంటూ బెదరించారు. ఎట్రా, ఎవడ్రా అన్న మాటలకు అధికారులు ఒకింత సహనంతో ఉన్నప్పటికీ అధికార పార్టీ ప్రజాప్రతినిధులు మాత్రం వెనక్కి తగ్గలేదు. అధికారులకు అవినీతి అంటగట్టారు. ఇదంతా సాధారణ సమావేశంలో జరిగింది కాదుసుమా? సాక్షాత్తూ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో చోటుచేసుకున్న సన్నివేశం. సీనియర్ అధికారులు ఆశ్చర్యపోయారు. జెడ్పీ ఛైర్‌పర్సన్ శోభా స్వాతీరాణి అధ్యక్షతన ఆదివారం సర్వసభ్యసమావేశం జరిగింది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం 53అంశాలపై చర్చించాల్సి ఉంది. ముఖ్యంగా ఇసుక, ఇటుకల ధరలు అదుపు తప్పడంతో జిల్లా ప్రజలపై కోట్లాది రూపాయలు భారం పడుతోంది. ఇసుక దొంగలు రూ.కోట్లకు పడగలెత్తుతున్నారు. ఇటు పంట చేతికందే సమయంలో ధాన్యం, పత్తి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇళ్ల మంజూరుపై క్లారిటీ లేదు. ఇళ్ల మరమ్మతుల నిధులు, రైతు రథాలు తమ్ముళ్లకే పరిమితమయ్యాయనే ఆరోపణలు ఉన్నాయి. హాస్టళ్లలో తగిన సదుపాయాల్లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా చలికి తట్టుకోలేక వణికిపోతున్నారు. ప్రభుత్వం ఏర్పాటై నాలుగేళ్లు కావస్తున్నా నేటికీ వేలాది మందికి రేషన్‌కార్డులు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు, పింఛన్లు అందలేదు. ఇలా ఒకటీ రెండూ కాదు రెండు రోజుల పాటు చర్చించినా సమయం సరిపోని పరిస్థితి. ఇటువంటి పరిస్థితుల్లో ఎంతో ఓపిక, సహనంతో అంశాలవారీగా చర్చించాల్సిన సభ్యులు రెండుగంటల్లో మమా అనిపించారు. అందులోనూ సమయమంతా అధికారులను తిట్టడానికే సరిపెట్టారు. తొలుత పంచాయతీరాజ్ శాఖపై చర్చ జరుగుతుండగా సిసి రోడ్ల బిల్లులు పూర్తిస్థాయిలో ఎందుకు జరగలేదని ఇఇని గజపతినగరం ఎమ్మెల్యే కెఎ నాయుడు నిలదీశారు. దీనిపై ఇఇ వివరణ ఇస్తుండగానే తీవ్ర ఆవేశంతో ఊగిపోతూ 'ఏట్రా నేను ఏంటి అడిగాను నువ్వు ఏం చెబుతున్నావ్ అంటూ ఏకవచనంతో ఊగిపోయారు. పనులు చేయడం చేతకాకపోతే చెప్పు నా సొంత మనుషులతో వారం రోజుల్లో పూర్తిచేయించుకుంటాను. అంతే కాని ఇటువంటి లెక్కలు చెప్పకు. బయటకు రా..! నీ అంతు తేలుస్తా అంటూ బెదిరింపు చర్యలకు పాల్పడడంతో అధికారులు బిత్తరపోయారు. వికలాంగుల శాఖ ఎడి ప్రోటోకాల్ పాటించలేదంటూ జెడ్పీ వైఎస్‌ఛైర్మన్ బలగం కృష్ణమూర్తి ఏకపక్షంగా దుర్భాషలాడాడు. బొండపల్లి జెడ్పీటిసి కృష్ణమూర్తి వాదనకు వంతపాడారు. విజయనగరం ఉత్సవాల్లో ప్రోటోకాల్ ఉల్లంఘటన జరిగిందంటూ విజయనగరం జెడ్పీటిసి సభ్యులు తుంపల్లి రమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా ఒకరి తర్వాత ఒకరు అధికార పార్టీ సభ్యులంతా తీవ్ర పదజాలంతో ఆరోపణలు చేయడంతో అధికారులు మనస్తాపానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి జెసి–2 కె.నాగేశ్వరరావు అధ్వర్యాన సుమారు 25మంది అధికారులు సమావేశమయ్యారు. ఇలా అయితే జిల్లాలో పనిచేయడం కష్టమేనన్న అభిప్రాయం వ్యక్తమైంది. జెడ్పీ సమావేశంలో అధికార పార్టీ సభ్యులు అనుసరించిన తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిని ఇవ్వనున్నారు. అవసరమైతే జనవరి 2నుంచి జరగనున్న జన్మభూమి – మా ఊరు కార్యక్రమాన్ని బహిష్కరించాలన్న చర్చ కూడా అధికారుల సమావేశంలో వచ్చినట్టు సమాచారం. సమావేశంలో సీనియర్ అధికారుల సంఘం గౌరవాధ్యక్షులు జెసి–2 నాగేశ్వరరావు, అధ్యక్షులు రాజ్‌కుమార్, జెడ్పీ సిఇఒ, వ్యవసాయం, పశు సంవర్థక శాఖ జెడిలు, ఎస్సీ కార్పొరేషన్ ఇడి తదితరులు పాల్గొన్నారు.

దిగొచ్చిన కాంట్రాక్టరు

- విజయానందంలో రైల్వే కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు
- పోరాట విజయం : సిఐటియు డివిజన్ కార్యదర్శి రెడ్డి శంకరరావు



రైల్వేస్టేషన్ ఎదుట విజయోత్సవంలో పాల్గొన్న కార్మికులు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

స్థానిక రైల్వేస్టేషన్‌లోని కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల పోరాటానికి కాంట్రాక్టరు దిగొచ్చారు. సబ్‌కాంట్రాక్టరు వేధింపులకు వ్యతిరేకంగా, వేతనాలు ఇవ్వాలని, హక్కులు కల్పించాలని కొద్ది రోజులుగా సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని, కొత్త కార్మికులను తీసుకోవడం జరగదని, ఉన్న కార్మికులందరితో పని చేయిస్తానని, కార్మిక హక్కులను అమలు చేస్తానని, సబ్ కాంట్రాక్టరు నుంచి వేధింపులు లేకుండా చేస్తానని కాంట్రాక్టరు హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు ఆదివారం చేపట్టిన ఆందోళన కార్యక్రమాన్ని విరమించారు. రైల్వేస్టేషన్ వద్ద కార్మికులను ఉద్దేశించి సిఐటియు డివిజన్ కార్యదర్శి రెడ్డి శంకరరావు మాట్లాడుతూ ఇది కార్మికుల పోరాట విజయమన్నారు. ఐక్యంగా ఉంటే సాధించలేనిదంటూ ఏమీ లేదని రైల్వే కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల పోరాటం రుజువు చేసిందని తెలిపారు. సబ్ కాంట్రాక్టరు వేధింపులు, ఇబ్బందుల కారణంగా కార్మికులు రోడ్డు మీదకు రావాల్సి వచ్చిందన్నారు. మూడు రోజుల నుంచి ఆందోళన చేపట్టడంతో ప్రధాన కాంట్రాక్టరు వచ్చి కార్మికుల సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమిస్తున్నామని ప్రకటించారు. కార్యక్రమంలో సిఐటియు డివిజన్ నాయకులు బి.రమణ, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

రామకృష్ణానగర్‌లో దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

నా ఊరు విజయనగరం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన ఆదివారం పట్టణంలోని రామకృష్ణానగర్‌లో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. వాకర్స్ క్లబ్ పూర్వ గవర్నర్ ఎస్ఎస్ఎస్ఎస్విఆర్ఎం రాజు దుస్తులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాల వల్ల స్వచ్ఛంద సంస్థల పేరు ప్రఖ్యాతలు పెరుగుతాయని చెప్పారు. ప్రతిఒక్కరూ సేవా కార్యక్రమాల్లో ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు చంద్రమౌళి, మండపాక రవి, కల్యాన, చారి, భవాని, మూర్తి, సాయిప్రసాద్ పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న రాజు

గడిగెడ్డ నుంచి తాగునీరెలా?

- హామీలపై ప్రభుత్వ పెద్దలను జన్మభూమి సభల్లో నిలదీయండి
- వైసిపి జిల్లా సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

రామతీర్థసాగర్ ప్రాజెక్టు గురించి పట్టించుకోకుండా సాంకేతికంగా సాధ్యం కాని గడిగెడ్డ ప్రాజెక్టుతో విజయనగరం పట్టణానికి తాగునీరెలా తీసుకురాగలరో తెలుగుదేశం నేతలు చెప్పాలని వైసిపి జిల్లా సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం, అరకు పార్లమెంట్ నియోజకవర్గాల అధ్యక్షులు బెల్లాన చంద్రశేఖర్, ఎస్.పరీక్షిత్‌రాజు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సత్యా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2017లో అధికారంలో ఉన్న తెలుగుదేశంపార్టీ ప్రభుత్వం వల్ల జిల్లా ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలేవీ అమలు చేయలేదన్నారు. రైతులకు, డ్వాక్రా మహిళలకు నేటికీ రుణమాఫీ చేయలేదని తెలిపారు. తోటపల్లి ప్రాజెక్టుకు సంబంధించి మంత్రి బొత్స సత్యనారాయణ సారథ్యంలో 90 శాతం పనులు పూర్తి చేస్తే టిడిపి ప్రభుత్వం వచ్చి నాలుగేళ్లలో పది శాతం పనులు కూడా పూర్తి చేయలేదని దౌర్భాగ్యమైన స్థితిలో ఉందని విమర్శించారు. రామతీర్థ సాగర్ ప్రాజెక్టు పూర్తికి కేంద్రమంత్రి నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. రామతీర్థసాగర్ నుంచి తాగునీరు విజయనగరం పట్టణానికి తీసుకురాకుండా నదుల అనుసంధానం పేరుతో తోటపల్లి నుంచి గడిగెడ్డకు నీటిని తీసుకొచ్చేందుకు రూ.24 కోట్లు మంజూరు చేయించి పట్టణ ప్రజలను మోసగిస్తున్నారని ఆరోపించారు. గడిగెడ్డ ప్రాజెక్టు రైతుల ప్రాజెక్టు అన్నారు. సాంకేతికంగా మరో రూ.100 కోట్లు ఖర్చు పెడితే తప్ప అది పూర్తయ్యే పరిస్థితి లేదన్నారు. దాని నుంచి తాగునీరు విజయనగరం పట్టణానికి ఎలా తీసుకొస్తారో ఆ నాయకులే చెప్పాలన్నారు. మరోవైపు గతేడాది జిల్లాకు రావాల్సిన నిధులు తీసుకురావడంలో టిడిపి నేతలు విఫలమయ్యారని విమర్శించారు. ఈ నేపథ్యంలో జనవరి రెండో తేదీ నుంచి జరుగుతున్న జన్మభూమి సభలో రైతులు, డ్వాక్రా మహిళలు రుణమాఫీ గురించి, నిరుద్యోగులు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి గురించి ప్రభుత్వ పెద్దలను నిలదీయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అవనాపు విజయ్, నాయకులు సూర్యనారాయణరాజు, పిళ్లా విజయ్‌కుమార్, ఎ.శ్రీరాములునాయుడు, గాడు అప్పారావు, డోల మన్మథకుమార్ పాల్గొన్నారు.

అంకితభావంతో సేవ చేస్తే గుర్తింపు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

అంకిత భావంతో పనిచేస్తే ప్రజల హృదయాల్లో చిరస్థాయిలో నిలుస్తారని ఎస్‌పి పాలరాజు తెలిపారు. పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం బాధ్యతాయుతంగా, క్రమ శిక్షణగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన డిటిసి ఎస్ఐ బగ్గాం సాంబశివరావు, విజయనగరం సిసిఎస్ ఎస్ఐ బొత్స పైడియ్య, డిపిఒ హోంగార్డు కోరాడ అప్పారావుకు ఎస్‌పి కార్యాలయంలో ఆదివారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి ఆరోపణలూ లేకుండా సుదీర్ఘ కాలం విధులను నిర్వహించడం, నిజజీవితంలోనూ వారి పిల్లలను ఉన్నత స్థితికి చేర్చడం వంటి సంఘటనలు ఎంతో క్రమశిక్షణతో వ్యవహరిస్తేనే సాధ్యమన్నారు.

ఉద్యోగుల ఆత్మీయ వీడ్కోలు సభలో ఎస్‌పి జి.పాలరాజు



ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులతో ఎస్‌పి పాలరాజు

ఉద్యోగ విరమణ అనంతరం ఇష్టమైన రంగంలో విలువైన సమయాన్ని గడిపేలా చూసుకోవాలని సూచించారు. సమాజానికి అవసరమైన సహాయ, సలహాలను అందించి, సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అదనపు ఎస్‌పి అట్టాడ వెంకటరమణ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేస్తున్న ఎస్ఐలు, హోంగార్డు క్రమశిక్షణతో వ్యవహరించి, మిగిలిన పోలీస్ ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచేవారన్నారు. అనంతరం ఎఆర్ డిఎస్‌పి ఎ.హనుమంతు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు ఎం.వి.ఆర్.సింహాచలం మాట్లాడారు. ఉద్యోగ విరమణ చేసిన ఎస్ఐలు బగ్గాం సాంబశివరావు, బొత్స పైడియ్య, హోంగార్డు కోరాడ అప్పారావు దంపతులను ఎస్‌పి సత్కరించారు. కార్యక్రమంలో అదనపు సిసిఎస్ డిఎస్‌పి ఎ.ఎస్.చక్రవర్తి, డిటిసి డిఎస్‌పి సిహెచ్.జి.వి.ప్రసాద్, స్పెషల్‌బ్రాంచ్ సిఐ వై.వి.శేషు, విజయనగరం రూరల్ సిఐ దాసరి లక్ష్మణరావు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, గురునాథరావు, డిసిఆర్‌బి ఎస్ఐ అప్పారావు, సిసిఎస్ ఎస్ఐ రాజు, ఆర్ఎస్ఐ మురళీధర్, పోలీసు పిఆర్‌ఒ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

డిఇఒ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-విజయనగరం

జనవరి ఒకటో తేదీన ఐచ్ఛిక సెలవు ఇవ్వకూడదని డిఇఒ ఆదేశించడం ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధమని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, కె.శేషగిరి, గౌరవాధ్యక్షులు ఎ.శివవర్మ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి పాఠశాల విద్యా సంవత్సరంలో ఐదు ఐచ్ఛిక సెలవులు ఇచ్చుకునే అవకాశం జిఒ 1205 ద్వారా ప్రభుత్వం కల్పించినట్లు తెలిపారు. జన్మభూమి కార్యక్రమం కోసం ఐచ్ఛిక సెలవులను నిరాకరించడం సరికాదని చెప్పారు. జిల్లాలో సెలవుల వినియోగంపై ఇటువంటి ఆంక్షలు కొంతకాలం నుంచి పెడుతున్నారని, ఈ వైఖరి మార్చుకోవాలని డిమాండ్ చేశారు. డిఇఒ ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని కోరారు.



పురస్కారం అందుకుంటున్న బాలకృష్ణ

బాలకృష్ణకు పురస్కారం

ప్రజాశక్తి-విజయనగరం

భీమిలిలో నిర్వహించిన రెయ్యి వీరాస్వామి సాహిత్య అవార్డు - 2017 జాతీయ స్థాయి కవితల పోటీల్లో ఉత్తమ కవితా పురస్కారం వర్ధమాన కవి రత్నాల బాలకృష్ణకు లభించింది. 'యుద్ధమంటే' అనే కవితకు బాలకృష్ణకు అవార్డు లభించింది. బాలకృష్ణకు సాహితీ ప్రముఖులు రాజా చంద్రశేఖర్, చీకటి దివాకర్, బి.సరోజ అభినందనలు తెలిపారు.



చెక్కు అందజేస్తున్న ప్రసాదరావు

వృద్ధులకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ప్రేమసమాజం ఆశ్రమంలో వృద్ధులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించేలా కృషి చేయాలని విశాఖకు చెందిన ధార్మికవేత్త ముగడ ప్రసాదరావు తెలిపారు. ఆదివారం స్థానిక ప్రేమసమాజం ఆశ్రమంలో వృద్ధుల కోసం నిర్మిస్తున్న భవనానికి రూ.రెండు లక్షల విరాళాన్ని ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో పెద్దింటి అప్పారావు, డాక్టర్ బిఎస్ఆర్ మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండరు ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక రైల్వేస్టేషన్ ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ ట్రస్టు ఆధ్వర్యాన 2018 క్యాలెండరును లీలామహల్ థియేటర్ మేనేజర్ కె.సత్యానందం ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షులు ఎం.అప్పారావు, ఆర్.చక్రి, ఎమ్‌డి అస్లాం, శ్రీను, రమేష్, శివశంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

చిట్టిగురువులు స్ఫూర్తితో నిరక్షరాస్యత నిర్మూలన

- దేశవ్యాప్తంగా అమలుకు సన్నాహాలు • త్వరలో ఎనిమిదో దశ అమలు
- వేతన బకాయిలు మంజూరు • వయోజన విద్యాశాఖ డిడి కోట్ల సుగుణాకరరావు



ప్రజాశక్తి - విజయనగరంటౌన్

దేశంలోనే ఆదర్శంగా నిలిచిన చిట్టిగురువులు స్ఫూర్తితో జిల్లాలో నిరక్ష్యరాస్యతను రూపుమాపేందుకు చర్యలు తీసుకుంటున్నామని వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ కోట్ల సుగుణాకరరావు అన్నారు. ఇటీవల ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో 'ప్రజాశక్తి' ముఖాముఖికి ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. జిల్లాలో అక్షరాస్యత పెంపునకు శాఖపరంగా తీసుకుంటున్న చర్యలు, వాటి అమలు తీరును వివరించారు.

నిరక్ష్యరాస్యతను పోగొట్టేందుకు తీసుకుంటున్న చర్యలేమిటి?
జిల్లాలో సాక్షరతా భారత్ ద్వారా నిరక్షరాస్యతను రూపుమాపేందుకు ఇప్పటికే ఆరు దశల కార్యక్రమాన్ని పూర్తి చేశాం. ఏడో దశ ముగింపుకొచ్చింది.

అక్షరాస్యులుగా మార్చేందుకు ఎలాంటి ప్రణాళికలు అమలు చేస్తున్నారు?
వయోజనులను అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రభుత్వం నిబంధనల ప్రకారం దశల వారీగా కృషి చేస్తున్నాం. ఇప్పటి వరకు జిల్లాలో ఏడు దశలు పూర్తి చేసుకున్నాం. ఇది మూడో తరగతి విద్యార్థితో సమానం. దీన్ని ఏ దశ అని కూడా అంటారు. తర్వాత బి, సి, డి,ఇ, దశలు ఉంటాయి.

ఏడో దశలో ఎంత మంది ఉన్నారు?, వారి పరిస్థితి ఏమిటి?
ఏడో దశ కార్యక్రమం ఇటీవల పూర్తి అయింది. ఇందులో పరీక్షలు అందరూ రాశారు. ఎంత మంది ఉత్తీర్ణులయ్యారన్న ఫలితాలు రెండు రోజుల క్రితమే వచ్చాయి. వీటిని త్వరలో ప్రకటిస్తాం.

బి, సి, డి, ఇ దశలు గురించి వివరించండి?
బి దశ అంటే ఐదో తరగతితో సమానం. సి దశ అంటే ఎనిమిది, డి దశ అంటే పదో తరగతి, ఇ దశ అంటే ఇంటర్మీడియట్‌తో సమానం. ఆ తర్వాత దశలు లేవు.

జిల్లాలో ప్రస్తుతం ఏ దశ నడుస్తోంది. దీనికి ఎంత మందిని లక్ష్యంగా పెట్టుకున్నారు?
జిల్లాలో బి దశ నడవాల్సి ఉంది. ఇంకా ప్రభుత్వం నుంచి ఈ దశను అమలు చేయమని ఎలాంటి ఉత్తర్వులూ రాలేదు. వచ్చాక దాన్ని అమలు చేస్తాం.

విద్యను ఎన్ని రకాలుగా అమలు చేస్తున్నారు?
సాక్షరతా భారత్ కార్యక్రమం ద్వారా విద్యను రెండు రకాలు విభజించి, అందిస్తున్నాం. వాటిలో అక్షరాస్యత కార్యక్రమం, రెండోది వయోజన విద్యా కార్యక్రమం.

రెండు రకాల విద్య అమలు తీరు ఎలా ఉంది?
సాక్షరతా కార్యక్రమంలో ఎనిమిదో దశ అమలు కావాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి ఉత్తర్వుల కోసం ఎదురు చూస్తున్నాం.

ఎనిమిదో దశను ఎలా అమలు చేస్తారు?
ఎనిమిదో దశ అంటే ఐదో తరగతితో సమానం. దీన్ని విజయవంతం చేసేందుకు చిట్టిగురువులు విధానాన్ని అమలు చేస్తాం. దీనిపై ఇప్పటికే వచ్చిన అనుభవాలతో కలెక్టర్ సూచించారు. దీన్ని అనుసరించి చేపడతాం.

వయోజన విద్య ఎలా అమలవుతోంది?
వయోజన విద్యా కార్యక్రమాన్ని నాలుగు రకాలుగా అమలు చేయాల్సి ఉంది.వాటిలో మొదటిది అక్షరాస్యత. రెండోది నిరంతర విద్య. మూడోది సమాంతర విద్య, నాలుగోది వృత్తి



నైపుణ్య విద్య. జిల్లా ఇంకా మొదటి దశలోనే ఉంది. అక్షరాస్యతా కార్యక్రమం కొనసాగుతుండగానే వృత్తి నైపుణ్య కార్యక్రమం అమలుకు చర్యలు చేపడుతున్నాం.

జిల్లాలో ఎంత మందితో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు?
జిల్లాలో 34 మండలాల్లో కో ఆర్డినేటర్లు, 920 పంచాయతీల్లో ఇద్దరు చొప్పున్న విలేజ్ కో ఆర్డినేటర్లు 1840 మంది ఉన్నారు.

కోఆర్డినేటర్ల జీతాల మంజూరు ఎలా ఉంది?
వీరికి ఐదు నెలల వేతనాలు బకాయిలు ఉంది. ఆ మొత్తం ఇటీవల మంజూరయ్యాయి. త్వరలో వారి బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేస్తాం.

చిట్టిగురువులు కార్యక్రమాన్ని ఎలా అమలు చేస్తారు?
జిల్లాలో ఎనిమిదో దశలో చిట్టిగురువులు కార్యక్రమం ద్వారా 55,819 మందిని అక్షరాస్యులుగా తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీన్ని పక్కాగా అమలు చేసేందుకు విద్యాశాఖ సహకారాన్ని తీసుకుంటాం.

చిట్టి గురువులు దేశవ్యాప్తంగా అమలు కానుందా?
అవును నిజమే. జిల్లాలో నిరక్షరాస్యతను రూపుమాపేందుకు తీసుకుంటున్న చర్యలను కేంద్రప్రభుత్వం కూడా గమనించింది. ఈ విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇక్కడ వెలుగులోకి వచ్చిన ఈ పద్ధతిని సమర్థవంతంగా అమలు చేసి, జిల్లాలో విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నాం.



పెద్దలకు బోధిస్తున్న చిట్టిగురువులు (ఫైల్)

చిత్రం చెప్పిన కథ



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న ప్రధాన రహదారి



అలంకరణ సామగ్రి షాపు వద్ద హడావిడి





గ్రీటింగ్ కార్డులు కొంటున్న యువతులు

అమ్మకానికి సిద్ధంగా ఉన్న బొకేలు

కొత్త సంవత్సర సందడి

కిటకిటలాడిన మార్కెట్

ప్రజాశక్తి - కంటోన్మెంట్

కొత్త సంవత్సర వేడుకలకు జిల్లా కేంద్రం సిద్ధమైంది. అర్ధరాత్రి వేడుకలకు ఈ సందర్భంగా ఏర్పాట్లలో ప్రజలు తలమునకలయ్యారు. మెయిన్ రోడ్డు వచ్చి, పోయే వారితో కిటకిటలాడింది. స్వీట్లు, కేకుల షాపుల వద్ద సందడి నెలకొంది. వినియోగదారులను ఆకట్టుకునేందుకు కొత్త రకాలను తయారు చేశారు. అలంకరణ సామగ్రి షాపులకు కూడా కొనుగోలుదారులు పోటెత్తారు. గ్రీటింగ్‌ల అమ్మకాలు గతంతో పోలిస్తే కొంతవరకు తగ్గాయని చెప్పొచ్చు. యువత ఎక్కువగా కొన్నారు. రంగులు, బొకేలు, పళ్లు, పూల షాపులు కూడా సందడిగా కనిపించాయి. గతం కంటే వీటి ధరలు బాగా పెరిగాయి. అయినా వీటి కొనుగోలుకు జనాలు పోటెత్తారు. దీనికితోడు సంక్రాంతి దగ్గర పడడంతో మార్కెట్ అంతా కిటకిటలాడుతోంది.




ఓ దుకాణం వద్ద కేకులు కొనుగోలు చేస్తున్న ప్రజలు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న రకరకాల స్వీట్లు



ముగ్గులు వేసేందుకు రంగులు కొంటున్న మహిళలు



వ్యాపారి ఇంటి వద్ద ఉన్న గోనె సంచులు

ముచ్చర్లలో వ్యాపారులు కొనుగోలు చేసిన ధాన్యం

ధాన్యం కొను 'గోల్‌మాల్'

- కొనసాగుతున్న దళారుల హవా
- వ్యాపారుల ఇళ్లల్లో గోనె సంచులు
- 15 రోజులు గడిచినా రైతులకు అందని డబ్బులు

ప్రజాశక్తి-గజపతినగరం


ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరుగాలం కష్టపడి పండించిన రైతుల కన్నా దళారుల కొనసాగుతోంది. దళారీ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించి రైతులకు మద్దతుధర కల్పించే ఉద్దేశంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లుగా ప్రభుత్వం చెబుతున్నా ఆచరణలో మాత్రం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం తమ పార్టీ విధేయులకు అప్పగించినట్లుగా తెలుస్తోంది. ఆ ప్రకారమే ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ కూడా ఉంది.

గతేడాది వరకు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు పెద్దపీట వేస్తూ వాటికే ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణను అప్పగించారు. అయితే జిల్లాలో 150 వరకు పిఎసిఎస్‌లు ఉండగా గతేడాది 92 పిఎసిఎస్‌లకు ధాన్యం కొనుగోలు బాధ్యతను అప్పగించారు. ఈ ఏడాది వాటి సంఖ్య 62కు తగ్గించగా, తాజాగా రెండు కేంద్రాలను బాధ్యత నుంచి తొలగించారు. మండలంలో చంగచోళ్లపెంట, లింగాలవలస, మరుపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

తూతూమంత్రంగా కొనుగోలు

రైతుల కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాలు పేరుకే తప్ప మిల్లర్లు, ప్రయివేటు వ్యాపారులదే పెత్తనంగా కనిపిస్తోంది. రైతులు కొనుగోలు కేంద్రాల వద్దకు గోనెసంచులు కావాలని వెళ్లినా రెండు, మూడు రోజులు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. వ్యాపారులకు మాత్రం గోనెసంచులు ఎన్ని కావాలన్నా తృణమో, ప్రణమో తీసుకుని ఇస్తున్న సందర్భాలు కోకొల్లలు. రైతులు ధాన్యాన్ని మిల్లులకు చేరవేసి, బ్యాంకుల్లో నగదు జమ కోసం కేంద్రాల నిర్వాహకులకు ఎంతో కొంత ఇస్తే గానీ బిల్లులు ఆన్‌లైన్ చేయని పరిస్థితులు నెలకొన్నాయి. అదే వ్యాపారులు, దళారులకు కేంద్రాల నిర్వాహకులకు మధ్యం ఒప్పందం ఉండటంతో బిల్లులు ఆన్‌లైన్ ప్రక్రియ మాత్రం వెనువెంటనే జరిగిపోతోందని రైతులు చెబుతున్నారు.

ప్రస్తుతం మండలంలోని అన్ని గ్రామాల్లోనూ రైతులు వరి నూర్పుల్లో నిమగ్నమై, ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దకు తరలించే పనుల్లో ఉన్నారు. కేంద్రాల్లో రైతుల కన్నా దళారులు, వ్యాపారులకు ప్రథమ ప్రాధాన్యమిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. గోనె సంచులు కావాలన్నా కొనుగోలు కేంద్రాలకు రెండు, మూడు రోజులు తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద తూనిక యంత్రం, తేమ, మట్టిబెడ్డలను చూసే యంత్రాలతోపాటు వ్యవసాయశాఖ నుంచి ఒక అధికారి ఉండాలి. అటువంటి పని లేని పరిస్థితి కొనుగోలు కేంద్రాల వద్ద దర్శనమిస్తోంది.



గంగచోళ్లపెంటలో ఖాళీగా ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రం

నత్తనడకన చెల్లింపులు

మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి గంగచోళ్లపెంట కేంద్రం ద్వారా 160 మంది రైతుల నుంచి 46,280 బస్తాలు, లింగాలవలసలో 92 మంది రైతుల నుంచి 31,642 బస్తాలు, మరుపల్లిలో 79 మంది నుంచి 24,712 బస్తాలు ధాన్యం కొనుగోలు చేశారు. వీరికి సుమారు రూ.మూడు కోట్లకు పైగా చెల్లించారు. ఇంకా మరో రూ.ఆరు కోట్లు వరకు చెలించాల్సి ఉంది. మిల్లర్లు ప్రభుత్వానికి బ్యాంకుల్లో డిపాజిట్లు చేయాల్సిన మొత్తం రూ.60 లక్షల వరకు చెల్లించక పోవడంతో బిల్లుల చెల్లింపులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో కేంద్రాలను ప్రారంభించిన మూడు వారాలు గడిచినా బిల్లులు మాత్రం రైతులకు అందడం లేదు. ఇంకోవైపు పక్క మండలంలోని చాలా గ్రామాల్లో వ్యాపారులు ధాన్యాన్ని రైతుల నుంచి క్వింటా రూ.1450కు కొనుగోలు చేసి ఉభయగోదావరి జిల్లాలకు కళ్లాల నుంచే నేరుగా తరలిస్తున్నారు.

సమస్యలు పరిష్కారం కాని 'జన్మభూమి' ఎందుకు?

ప్రజాశక్తి-గజపతినగరం

ప్రజా సమస్యలు పరిష్కారం కాని జన్మభూమి కార్యక్రమం ఎందుకని సిపిఎం నాయకులు పురం అప్పారావు ప్రశ్నించారు. స్థానిక పురిటిపెంటలో సంతతోటలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకూ నాలుగు జన్మభూమి కార్యక్రమాలు నిర్వహించారని, వీటిలో అందిన అర్జీల్లో ఎన్ని పరిష్కరించారో చెప్పాలని డిమాండ్ చేశారు. మొక్కుబడిగా జన్మభూమి కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రభుత్వ ప్రచారం తప్ప ప్రజలు ఒరిగిందేమీ లేదని చెప్పారు. ఉపాధి హామీ పథకంలో నెలలు గడిచినా చేసిన పనులకు కూలీలకు చెల్లింపులు జరగలేదని తెలిపారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయడం లేదని తెలిపారు. ఇంటికో ఉద్యోగం, డ్వాక్రా, రైతు రుణమాఫీ, నిరుద్యోగ భృతి, తదితర హామీలు నేటికీ అమలు కాలేదని విమర్శించారు. గ్రామసభల్లో వీటిపై ప్రజాప్రతినిధులను నిలదీయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.సత్యం, తదితరులు పాల్గొన్నారు.



కృత్రిమ కాళ్లను అమర్చుతున్న శంకర్ నారాయణ

కృత్రిమ అవయవాలు పంపిణీ

ప్రజాశక్తి-కొత్తవలస

మంగళపాలెంలో వద్దనున్న గురుదేవ్ చారిటబుల్ ట్రస్టులో ఆదివారం హాస్యబ్రహ్మ దంపతులు శంకర్ నారాయణ, భారతి దంపతుల షష్టిపూర్తి సందర్భంగా వికలాంగులకు కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు వ్యవస్థాపకులు రాపర్తి జగదీశ్‌బాబు సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో టాటా ప్రోడక్ట్ పరిశ్రమ జనరల్ మేనేజర్ బి.ఎస్.భాస్కర్, ఇఎస్ఐ జాతీయ బోర్డు సభ్యులు రామకోటయ్య, చిన్నారావు, భువన, శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.



కేకు కట్ చేస్తున్న శాంతి

'రవీంద్ర భారతి'లో న్యూఇయర్ వేడుకలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని రవీంద్ర భారతి స్కూల్లో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ శాంతి మెహంతి మాట్లాడుతూ నూతన సంవత్సరంలో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలన్నారు.

అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తవలసలో కేకుల సందడి

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస జంక్షన్‌లో ఆదివారం నూతన సంవత్సర కేకుల సందడే నెలకొంది. స్వీట్, బేకరీ షాపుల వద్ద సాయంత్రం నాలుగు గంటల నుంచి టెంట్లు వేసి కేకులను అమ్మకాలకు సిద్ధంగా ఉంచారు. వివిధ అలంకరణల్లో కేకులను ఆకట్టుకునేలా తయారు చేశారు. తక్కువ ధరల్లో భారీ ఎత్తున కేకులను అమ్మకానికి పెట్టారు. దీంతో రోడ్డుపై వెళ్లే వారంతా కొనుగోలుకు ఆసక్తి చూపించారు. సాయంత్రం వేళ స్వీట్, బేకరీ షాపులు కేకులు, స్వీట్ల కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. గ్రీటింగ్ కార్డులు, రంగుల దుకాణాలు ఎక్కడికక్కడే వెలిశాయి.



అమ్మకాలకు సిద్ధంగా ఉంచిన కేకులు

రేపటి నుంచి జన్మభూమి గ్రామసభలు

ప్రజాశక్తి-దత్తిరాజేరు

మండలంలో మంగళవారం నుంచి నిర్వహించే జన్మభూమి - మాఊరు గ్రామసభల షెడ్యూల్‌ను ఎంపిడిఒ కృష్ణవేణమ్మ తెలియజేశారు. మండలంలో రెండు బృందాలుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 2న విజయరాంపురం, ఎస్.చింతలవలస, షికారుగంజి, పి.లింగాలవలస, 3న రామచంద్రపురం, ఎస్.బూర్జివలస, పాచలవలస, కె.కొత్తవలస, 4న తాడెందొరవలస, కె.కృష్ణాపురం, కోమటిపల్లి, చౌదంతివలస, 5న మరడాం, ఇంగిలాపల్లి, 6న పెదమానాపురం, వి.కృష్ణాపురం, దాసరపేట, వింధ్యవాసి, 8న దత్తి, వంగర, గుచ్చిమి, గొభ్యం, 9న చినకాద, గడసాం, కన్నాం, ఎం.లింగాలవలస, 10న దాసుపేట, టి.బూర్జివలస, పోరలి, భూపాలరాజపురం, 11న చుక్కపేట, సరాయివలస, దత్తిరాజేరు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామని వివరించారు.

కొత్తవలస మండలంలో...

కొత్తవలస : మండలంలో మంగళవారం ప్రారంభమయ్యే జన్మభూమి గ్రామసభల వివరాలను ఎంపిడిఒ నారాయణరావు వెల్లడించారు. 2న చినరావుపల్లి, చిన్నిపాలెం, అప్పన్నదొరపాలెం, రెల్లి, 3న ముసిరాం, వియ్యంపేట, అప్పన్నపాలెం, నిమ్మలపాలెం, 4న చీడివలస, గొల్లలపాలెం, గులివిందాడ, గనిశెట్టిపాలెం, 5న కాటకాపల్లి, కంటకాపల్లి, 6న మంగళపాలెం, దెందేరు, 7న ఉత్తరాపల్లి, సంతపాలెం, 8న దేవాడ, రామలింగపురం, 9న తుమ్మికాపల్లి, వీరభద్రపురం, 10న దేశపాత్రునిపాలెం, చింతలపాలెం, 11న కొత్తవలసలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ అభివృద్ధికి కృషి


బాండ్లను అందజేస్తున్న వాయునందన శర్మ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

బ్రాహ్మణ కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని బ్రాహ్మణ కార్పొరేషన్ జిల్లా ఆర్గనైజర్ భోగాపురపు వాయునందన శర్మ తెలిపారు. ఆదివారం జరజాపుపేట గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో బ్రాహ్మణ సంఘం సభ్యులకు జిల్లా ఆర్గనైజర్ వాయునందన శర్మ క్రెడిట్ సొసైటీ ద్వారా బాండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా అందుతున్న పథకాలను బ్రాహ్మణులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రెడిట్ సొసైటీలో సభ్యులుగా చేరి కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలన్నారు. చాణక్య పథకం కింద 2016-17 సంవత్సరానికి 19 మందికి రాయితీపై జిల్లావ్యాప్తంగా రుణాలు ఇస్తామన్నారు. భారతీ పథకం కింద 1000 మంది బ్రాహ్మణ విద్యార్థులకు ఉపకార వేతనాలిచ్చామన్నారు. చాలా కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ మాజీ సమన్వయకర్త కె.వేణుగోపాల్, సంఘం సభ్యులు ప్రసాద్ పాల్గొన్నారు.

అంకితభావంతో ఉపాధ్యాయులు పనిచేయాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి మంచి ఫలితాలు తీసుకురావాలని జెడ్‌పిటిసి సభ్యులు సన్యాసినాయుడు తెలిపారు. ఆదివారం కొండవెలగాడ మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని రోజారమణికి చనుమల్లుపేట బదిలీ కావడంతో గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సన్యాసినాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి మంచి ఫలితాలు తీసుకు రావాలన్నారు. విద్యార్థులకు మంచి బోధనలు చేసి ఉన్నత స్థానాలకు చేరడానికి కృషి చేయాలన్నారు. ముఖ్యంగా ప్రాథమిక స్థాయిలో పటిష్టపరిచి విద్యార్థులు ముందుకు సాగడానికి, ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలన్నారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలు రోజారమణి సేవలు గుర్తుండిపోతాయన్నారు. అనంతరం రోజారమణిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు బి.పైడమ్మ, హెచ్ఎం ఆనందమూర్తి, ఉన్నత పాఠశాల హెచ్ఎం పి.విక్టోరియారాణి, ఉపాధ్యాయులు ఎ.కమల్‌దేవి, శ్రీదేవి, శివప్రసాద్, తిరుపతిరావు పాల్గొన్నారు.

జెడ్‌పిటిసి సభ్యులు సన్యాసినాయుడు


ఉపాధ్యాయిని రోజారమణిని సన్మానిస్తున్న జెడ్‌పిటిసి సభ్యులు సన్యాసినాయుడు

రమణకు ఘన సన్మానం


రమణను సన్మానిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ స్వాతీరాణి

ప్రజాశక్తి-చీపురుపల్లి

పట్టణంలోని ఆశయ యూత్ అసోషియేషన్ అధ్యక్షులు రెడ్డి రమణను జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి ఘనంగా సన్మానించారు. యువజన మహోత్సవాలలో భాగంగా విజయనగరంలో జరిగిన కార్యక్రమంలో రమణను సన్మానించారు. సమాజానికి రమణ అందిస్తున్న సేవలను పలువురు కొనియాడారు. రమణను సన్మానించిన వారిలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ జి.శ్రీనివాసులనాయుడు, ఎజెసి నాగేశ్వరరావు, నెల్లిమర్ల ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామినాయుడు, పిఐటి పోలీస్ ట్రైనింగ్ ప్రిన్సిపల్ రాజశేఖామణి, సిఐఒ ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కాగా ఆశయ యూత్ అసోషియేషన్ అధ్యక్షులు రెడ్డి రమణ పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతుంటారు. దీంతో ఆయన్ను జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రెడ్డి రమణను పట్టణ ప్రముఖులతో పాటూ అనేకమంది అభినందించారు. ఆయన మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం : ఎంపిపి

ప్రజాశక్తి-చీపురుపల్లి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపిపి రౌతు కాంతమ్మ అన్నారు. ఆదివారం జి.అగ్రహారంలోని సిసి రోడ్డుకు తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు రౌతు కామునాయుడితో కలసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో పార్టీలకు అతీతంగా అన్ని శ్రేణుల వారికి ప్రభుత్వ పథకాలు అందేటట్లు చూస్తున్నామన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ పథకాలు అందేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పట్టణంలో జి.అగ్రహారం బ్రాహ్మణ వీధిలో సిసి రోడ్డు నిర్మాణానికి రూ.4 లక్షలు మంజూరయ్యాయని ఆ నిధులతో పనులు ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కానరాని గ్రీటింగ్స్ సందడి

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలో ఆదివారం గ్రీటింగ్స్ సందడి కానరాలేదు. ఒకప్పుడు నూతన సంవత్సరం ముందు రోజు గ్రీటింగ్స్ స్టాళ్లు యువతతో కళకళలాడేవి. అనేకమంది గ్రీటింగ్స్‌ను ఉత్సాహంగా కొనుగోలు చేసేవారు. నూతన సంవత్సరం రోజున మిత్రులకు గ్రీటింగ్స్ ఇస్తూ శుభాకాంక్షలు తెలియజేసేవారు. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. మండల కేంద్రంలో అరకొరగా గ్రీటింగ్స్ స్టాళ్లు వెలిశాయి. వాటిని కొనుగోలు చేసేందుకు విద్యార్థులు మినహా ఎవరూ ఆసక్తి చూపలేదు. కాగా సెల్ ఫోన్ల వినియోగం పెరగడంతో అనేకమంది మిత్రులకు ఎస్ఎంఎస్ ద్వారా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్నారు. మరి కొంతమంది ఫోన్ చేసి మిత్రులకు, బంధువులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఇదిలావుండగా ఫేస్ బుక్, వాట్సాప్, ట్విటర్ అందుబాటులో ఉండడంతో ఎక్కువమంది వాటి ద్వారా శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్నారు. ఏదేమైనా గతంలో ఉన్న ఉల్లాసం, ఉత్సాహం యువతలో తగ్గినట్లు చెప్పవచ్చు.


మొక్కలు నాటుతున్న ప్రిన్సిపల్ జగదీష్, విద్యార్థులు

చదువుతో పాటూ సేవాభావం అవసరం

ప్రజాశక్తి-చీపురుపల్లి

విద్యార్థులు చదువుతో పాటు సేవాభావం కూడా అలవర్చుకోవాలని పట్టణంలోని సత్యరామా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ జిపి జగదీష్ తెలిపారు. మండలంలోని పుర్రేయవలసలో సత్యరామా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమంలో ఆయన ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ప్రాథమిక దశ నుండే సేవాభావం కలిగి ఉండాలన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పుర్రేయవలస పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎమ్ఎస్ ప్రసాద్, శ్రీనివాస జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్, మూర్తి, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ టి.ముకుంద పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చీపురుపల్లి

మండలంలో పిఆర్‌టియు ఆధ్వర్యంలో వేసిన క్యాలెండర్‌ను ఆదివారం మండల విద్యాశాఖాధికారి జె.మహాలక్ష్మునాయుడు ఆవిష్కరించారు. మండలంలో పిఆర్‌టియు నాయకుల ఆధ్వర్యంలో 2018 ఏడాదికి సంబంధించి క్యాలెండర్‌ను తయారుచేశారు. ఈ సందర్భంగా మండల రిసోర్స్ కార్యాలయం ఆవరణలో ఆవిష్కరించారు. క్యాలెండర్‌ను ఆవిష్కరించిన వారిలో పిఆర్‌టియు నాయకులు వలిరెడ్డి రవీంద్రనాయుడు, ఎం.జగన్నాథం, గంగుపల్లి సత్యనారాయణ, రమణ ఉన్నారు.

మెరకముడిదాం : 2018 పిఆర్‌టియు క్యాలెండర్‌ను ఆదివారం జిల్లా పిఆర్‌టియు అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్తి రాంబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్యాలెండర్‌లో విద్యార్థుల, ఉపాధ్యాయులకు సంబంధించిన విద్యా సంబంధ విషయాలు ఉన్నాయన్నారు. నూతన సంవత్సరం అందరికీ దోహదపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.సింహాద్రి, ఎ.శ్రీహరిరావు, జెబి శ్రీనువాసరావు, బి.కృష్ణమూర్తి, బి.చంద్రరావు, ఆర్.నారాయణరావు, రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.


మెరకముడిదాంలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

వైద్యుల కొరత.. రోగులకు వెత

• సాలూరు సిహెచ్‌సి దుస్థితి • డిప్యుటేషన్‌పై డాక్టర్లు బదిలీ • కొత్తవారిని నియమించని అధికారులు

ప్రజాశక్తి – సాలూరు

'కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న' చందంగా తయారైంది పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం పరిస్థితి. ఇక్కడ పని చేసిన ఇద్దరు వైద్యుల మధ్య తలెత్తిన విభేదాలతో, ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకునే స్థాయికి చేరింది. వాటిని పరిశీలించిన డిసిహెచ్‌ఒ ఉషశ్రీ నివేదిక ఆధారంగా డాక్టర్లను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి బదిలీ చేశారు. తగువులాడుకున్న డాక్టర్లను మందలించి, సరి చేయకుండా ఇక్కడి నుంచి పంపేయడంతో పేదలకు ఇబ్బంది ఏర్పడింది.

వైద్యుల మధ్య విబేధాలే కారణం

ఇక్కడ డాక్టర్లు ఎస్‌వి రామ్మూర్తి, శివరామకుమార్ కొద్ది రోజుల క్రితం పని చేశారు. సొంత వైద్యశాలలు ఉన్న వీరిద్దరి మధ్య తలెత్తిన విభేదాలతో ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకున్నారు. వీటిపై విచారించిన వైద్యాధికారి ఉషశ్రీ ఉన్నతాధికార్లకు నివేదిక పంపించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కూడా వివాదాలకు కారకులవుతున్న డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని చెప్పడంతో బదిలీ వేటు వేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా ప్రస్తుతం ఆసుపత్రిలో ఇబ్బందులు మొదలయ్యాయి. చిన్న పిల్లల వైద్య నిపుణుడైన బి.అప్పలనాయుడు ఒక్కరే ప్రస్తుతం ఒపి చూస్తున్నారు. ఆయనపై పనిభారం పెరిగింది. వైద్యాధికారి బాధ్యతలు కూడా ఆయనే నిర్వహిస్తున్నారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ అప్పలనాయుడు



సాలూరు సామాజిక ఆరోగ్య కేంద్రం

రోగుల తాకిడి అధికం

ఇక్కడికి నాలుగు మండలాలు, స్థానిక మున్సిపాల్టీ నుంచే కాకుండా ఒడిశా సరిహద్దు గ్రామాలకు చెందిన పేదరోగులు కూడా అధికంగా వస్తుంటారు. పట్టణ నడిబొడ్డున జాతీయ రహదారి వెళుతుండడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతుంటాయి. అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగులు ఎక్కువగా ఉంటారు. ప్రతిరోజూ 250 మంది పేద రోగులు, ఓపి విభాగానికి వస్తారు. కనీసం 20 మంది ఇన్‌పేషెంట్లుగా ఉంటారు. ఇదే సమయంలో ఆసుపత్రి నుంచి ఇద్దరు వైద్యులను డిప్యుటేషన్‌పై పంపడంతో పొయ్యి లోంచి పెనంపై పడ్డట్లయ్యింది. డాక్టర్ అప్పలనాయుడుతోపాటు అనస్తీషియా వైద్యులు సునీల్ వారంలో రెండు రోజులు వచ్చి సేవలందిస్తున్నారు. వీరుకాక దంత వైద్యులు, గైనకాలజిస్టు కూడా పని చేస్తున్నారు. డాక్టర్లు రామ్మూర్తి, శివకుమార్, అప్పలనాయుడు ఓపి చూస్తున్నప్పుడే ఒత్తిడి ఎక్కువగా ఉండేది. ఇప్పుడు ఇద్దరు వైద్యులు బదిలీ కావడం, కొత్తవారిని నియమించక పోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఓపిలో ఒక వైద్యుడే ఉండడంతో రోగులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. పని ఒత్తిడితో ప్రస్తుతం వున్న వైద్యులు నాణ్య మైన వైద్యసేవలు అందించలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నెల రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఈ ఆసుపత్రిని వైద్య విధాన పరిషత్‌లో విలీనం చేసినప్పటికీ వైద్యులు, సిబ్బంది సంఖ్యలో మార్పు లేదు. తక్షణమే కొత్త వైద్యులను నియమించాలని, లేకుంటే డెప్యుటేషన్ రద్దు చేసి పాతవారినే కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రదర్శనను ఆసక్తిగా పరిశీలిస్తున్న విదేశీయులు

'శ్వేతాచలపతి'లో గణితశాస్త్ర ప్రదర్శన

ప్రజాశక్తి – బొబ్బిలి

స్థానిక శ్వేతాచలపతి సంస్థానం ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ఆదివారం గణిత శాస్త్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 780 ప్రాజెక్టులను 20 రూముల్లో విద్యార్థులు ప్రదర్శించారు. అన్ని తరగతులకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో గణిత శాస్త్రం నుంచి నేర్పియర్ బోన్స్ పద్ధతి, నేర్పియరి కూడిక యంత్రం, పెంటాగ్రాఫ్, భారతదేశపు కరెన్సీ, జ్యామితీయ నగరం, త్రికోణమితి పద్ధతులు, బాడ్‌మాస్ విధానం, వాస్తవ సంఖ్యల కుటుంబం, పైథాగరస్ సిద్ధాంతం, వృత్తాకార దారంతో గుణకార పట్టికలు, వృత్త స్పర్శ రేఖలు, రేకియా, త్రిమితియ వస్తువులు, ఫ్యూచర్ బ్యాంకు మొదలగునవి ప్రదర్శించారు. ఈ ప్రాజెక్టులను బొబ్బిలి మండల పరిసర ప్రాంతాల విద్యార్థులు, తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు, ఇతర ప్రముఖులు సందర్శించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఫ్రాన్సిస్ జార్జ్ మాట్లాడుతూ ఇలాంటి ఎగ్జిబిషన్లతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ షిజోమన్ జోసెఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

'కాలుష్యరహితంగా తీర్చిదిద్దాలి'

ప్రజాశక్తి – బొబ్బిలి

పట్టణాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తూముల అచ్యుతవల్లి అన్నారు. స్థానిక 15వ వార్డులో స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా చెత్త బుట్టలను ఆదివారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ కార్యక్రమంలో మున్సిపాల్టీని ముందు వరుసలో నిలిపామని, పర్యావరణం సమతుల్యత పాటించడంలో ముందంజలో ఉండాలని సూచించారు. ప్రతి ఇంటికీ అందజేస్తున్న చెత్త బుట్టలను సద్వినియోగం చేసుకుని, ఆకుపచ్చ బుట్టలో తడి, నీలి రంగు బుట్టలో పొడి చెత్తలను వేయాలని తెలిపారు. దీన్ని ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా పాటించాలన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ సిహెచ్ రమేష్‌నాయుడు, కౌన్సిలర్లు బి.పార్వతి, ఆర్.శరత్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాల్లో పశువులకు తనిఖీలు

ప్రజాశక్తి – సీతానగరం

మండలంలోని గాదెలవలస, జానుమల్లువలసల్లో బొబ్బిలి ఇందిరాగాంధీ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యాన ఆదివారం ఉచిత పశువైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తనిఖీలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పాడి పశువుల పాల ఉత్పత్తి ఎలా పెంచాలి?, పశువులకు వచ్చే వ్యాధులు ఏమిటి అన్న అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రధానంగా గాలికుంటు వ్యాధులు, జబ్బవాపు వంటి వాటికి టీకాలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వై.రామినాయుడు, ఎస్.శంకరరావు, ఎన్‌ఎస్‌ఎస్ పిఒలు సత్యనారాయణ, రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.



పశువులకు తనిఖీలు చేస్తున్న వైద్యులు

మౌలిక సదుపాయాలకు రూ.34.54 కోట్లు

మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్

ప్రజాశక్తి – సాలూరు

నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం రూ.34 కోట్లా 54 లక్షలు మంజూరు చేసిందని మాజీఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్ చెప్పారు. ఆదివారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 213 తరగతి గదుల నిర్మాణానికి ఈ నిధులు మంజూరయ్యాయన్నారు. రూ.10 లక్షలా రెండు వేలతో ఒక్కో గది నిర్మిస్తామని తెలిపారు. రూ.రెండు లక్షలా 34వేల వ్యయంతో 55 మరుగుదొడ్లు నిర్మిస్తామన్నారు. ప్రధానోపాధ్యాయుల, కార్యాలయ గదులు, లేబోరేటరీ, లైబ్రరీ, కంప్యూటర్ రూములును నిర్మిస్తామన్నారు. గతంలో నిర్వహించిన డైస్ సర్వే ఆధారంగా ప్రభుత్వం ఏయే పాఠశాలలో ఏ సమస్యలు ఉన్నాయో తెలుసుకొని ఈ నిధులు ఇచ్చిందన్నారు. నిధుల మంజూరులో కొన్ని తప్పులు దొర్లాయని, సవరించి ప్రభుత్వానికి పంపిస్తామని చెప్పారు. మున్సిపాల్టీలో రోడ్లు, కాలువల నిర్మాణానికి ప్రత్యేకాభివృద్ధి నిధి కింద రూ.రెండు కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రూ.55 లక్షలతో క్యాజువాలిటీ వార్డు నిర్మించనున్నామని తెలిపారు.

జన్మభూమిని విజయవంతం చేయాలి

జనవరి రెండు నుంచి ప్రారంభమయ్యే జన్మభూమి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భంజ్‌దేవ్ కోరారు. నాలుగు మండలాల కార్యకర్తలు, నాయకులు ఈ సభలకు హాజరు కావాలని సూచించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. నియోజక వర్గానికి రెండు వేల పింఛన్లు మంజూరయ్యాయని చెప్పారు. ప్రత్యేకాధికారికి మరో 100 పింఛన్లు ప్రభుత్వం కేటాయించిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని భంజ్‌దేవ్ చెప్పారు. సమావేశంలో ఎఎంసి అధ్యక్షులు పి.ఈశ్వరరావు, టిడిపి సాలురు పట్టణ, పాచిపెంట మండల శాఖల అధ్యక్షులు ఎన్.తిరుపతిరావు, పి.ప్రసాద్‌బాబు, పట్టణ నాయకులు జి.మాధవరావు, సిహెచ్.త్రినాధరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి – సాలూరు

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల 1973–76 బ్యాచ్ ఇంటర్మీడియట్ పూర్వ విద్యార్థులు ఆదివారం శివాలయం వీధి కళ్యాణ మండపంలో సమావేశమ య్యారు. ఈ సందర్భంగా వారు ఒకరినొకరు పలుకరించుకుంటూ ఆత్మీయ ఆలింగనాలు చేసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. వైసిపి పట్టణ అధ్యక్షుడు జర్జాపు సూరిబాబు ఆధ్వర్యాన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అప్పటి గురువులు నూకల సూర్యారావు, బొర్రా సత్యనారాయణలను ఘనంగా సన్మానించారు. వారి ఆశీస్సులను పొందారు. కొత్త సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ సందడి చేశారు. సుదూర ప్రాంతాలనుంచి రిటైర్డు ఉద్యోగులు, వ్యాపారులు హాజరయ్యారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

'ప్రజలకు ఏం సమాధానం చెబుతారు?'

బొబ్బిలిటౌన్ : జన్మభూమిలో ప్రజలకు ఏం సమాధానం చెబుతారని లోక్‌సత్తా రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎ.దామోదరరావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత జన్మభూమిలో ప్రజలు తమ సమస్యలపై ఇచ్చిన వినతులు ఇంతవరకు పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదని విమర్శిం చారు. మళ్లీ కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం ఎంత వరకు సమంజసమని నిలదీశారు. పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న రహదారి విస్తరణను ఇంతవరకు పూర్తి చేయకపోవడం దారుణమని తెలిపారు. పండగ సమయంలో రహదారి సరిగ్గా లేక ఎక్కడ పడితే అక్కడ నీరు ప్రవహిస్తూ ప్రజలు నడవటానికి కూడా వీలు లేకుండా తయారైందని వివరించారు. జ్యూట్ మిల్లు మూసేయడంతో రెండు వేల మంది కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయని, నెల రోజుల్లో తెరిపిస్తానని రాష్ట్ర మంత్రి సుజయకృష్ణ రంగారావు ఇచ్చిన హామీ అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజా సమస్యలను పట్టించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బి.గణేష్, పి.లక్ష్మి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాలలో వేడుకలు

బొబ్బిలి : మండలంలోని అలజంగి సిబిఎం పాఠశాలలో హెచ్‌ఎం కె.కృష్ణదాస్ ఆధ్వర్యాన విద్యార్థులు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త ఏడాది అందరికీ మంచి జరగాలని, విద్యార్థులంతా బాగా చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

2 నుంచి 'జన్మభూమి' గ్రామసభలు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఈనెల 2 నుండి జరగనున్న ఐదో విడత జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మండల ప్రత్యేకాధికారి బి.సుదర్శనదొర తెలిపారు. జన్మభూమి కార్యక్రమం నిర్వహణపై సమీక్షా సమావేశాన్ని ఆదివారం మండలపరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్మభూమి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలన్నారు. ప్రజల నుంచి వచ్చే వినతులు శాఖల వారీగా స్వీకరించి ఆన్‌లైన్లో పొందుపర్చాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, తహశీల్దార్ ఎన్‌వి రమణ, ఎంపిపి టి.సాయమ్మ, సీనియర్ వైద్యాధికారి జి.ప్రభాకరరావు, సిడిపిఒ జె.విజయలక్ష్మి పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సుదర్శనదొర

రేపటి నుండి 'జన్మభూమి'

మండలంలో జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని మంగళవారం నుండి నిర్వహిస్తామని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి తెలిపారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఆమె మాట్లాడారు. ఎంపిడిఒ, తహశీల్దార్ రెండు బృందాలుగా ఏర్పడి ఈ కార్యక్రమాన్ని జనవరి 11 వరకూ నిర్వహిస్తామన్నారు. ఈనెల 2న పి.ఆమిటి, మండ, లక్కగూడ, కొండవాడ పంచాయతీల్లో, 3న దుమ్మంగి, రెల్ల, వంగర, కేదారిపురం పంచాయతీల్లో, 4న నోంద్రుకోన, పెదఖర్జ, ఇరిడి, కుక్కిడి పంచాయతీల్లో, 5న చాపరాయి బిన్నిడి, తాడికొండ, లుంబేసు పంచాయతీల్లో, 6న రాయగడజమ్ము, నెల్లికిక్కువ పంచాయతీలో, 7న బాలేసు, దుడ్డుఖల్లు పంచాయతీలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. 9న గొయిపాక, బీరుపాడు పంచాయతీలో, 10న చెముడుగూడ, చినగీశాడ పంచాయతీలో, 11న గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట పంచాయతీల్లో నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమానికి ఆయా శాఖల సిబ్బంది హాజరుకావాలని కోరారు.

ఉద్యోగ విరమణ సాధారణమే

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ సాధారణమేనని భద్రగిరి ఎపిఆర్ గురకుల బాలుర కళాశాల ప్రిన్సిపల్ ఆర్‌ఎస్‌విజి కృష్ణారావు తెలిపారు. ఆ కళాశాలలో సూపరింటెంట్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఎం.శ్రీరాములనాయుడుకు ఆదివారం కళాశాల సిబ్బంది, ప్రిన్సిపల్, బంధువులు, స్నేహితులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన శ్రీరాములనాయుడునుద్దేశించి పలువురు వక్తలు మాట్లాడుతూ ఉద్యోగ బాధ్యతలను మీరు బాగా నిర్వహించి అందరి మన్ననలు పొందారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు పి.సత్యేంద్రుడు, అచ్చుప్ప, కుమార్, నాగభూషణరావు పాల్గొన్నారు.

'ఐచ్ఛిక సెలవుపై ఆంక్షలు తగవు'

ప్రజాశక్తి - పార్వతీపురం

నూతన సంవత్సర దినమైన జనవరి 1న ప్రభుత్వం ప్రకటించిన ఐచ్ఛిక సెలవును వినియోగించుకోరాదని కొందరు డిఇఒలు ఆదేశాలు జారీ చేయడం సరికాదని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సింహాచలం ఖండించారు. ప్రభుత్వ ఉత్తర్వులు 2437 ప్రకారం జనవరి 1 ఐచ్ఛిక సెలవుగా ప్రకటించగా, విద్యాశాఖ క్యాలెండర్ సంవత్సరంలో ఐదు ఆప్షనల్ సెలవులను ఇచ్చుకునే అవకాశం ఉందన్నారు. జనవరి 2 నుంచి జన్మభూమి-మా ఊరు కార్యక్రమం ఉందని, కావున జనవరి 1 ఆప్షనల్ హాలీడే ఇవ్వరాదని డిఇఒలు కొన్ని జిల్లాల్లో సంక్షిప్త సందేశాల ద్వారా ఆదేశాలు ఇచ్చారన్నారు. జన్మభూమి కార్యక్రమానికి ఉపాధ్యాయులు సంపూర్ణ మద్దతు ఉంటుందని, కానీ ఆప్షనల్ హాలీడేకు ముడిపెట్టడం సరికాదని చెప్పారు.

'బోయ, వాల్మీకులను ఎస్‌టిలుగా ఆమోదించొద్దు'

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

రాష్ట్రంలో గల బోయ, వాల్మీకులను ఎస్‌టిలుగా పార్లమెంట్‌లో ఆమోదించొద్దని ఆదివాసీ చైతన్య సేవా సంఘం అధ్యక్షులు ఎ.సూర్యనారాయణ, నాయకులు సుదర్శనరావు, అశోక్, జోగారావు డిమాండ్ చేశారు. బోయ, వాల్మీకిలకు ఎస్‌టిల్లో చేర్చొదంటూ ప్రధానమంత్రికి, కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రికి, కేంద్ర, ఎస్‌టి కమిషనర్‌కు పంపేందుకు వినతులు వారు సిద్ధం చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో వారు మాట్లాడుతూ బోయలను ఎస్‌టిలో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఏకపక్షంగా తీర్మానం చేయడం దుర్మార్గమన్నారు. సుమారు 35 ఆదివాసీ తెగల్లో ఉండే ఆచారాలు గానీ, సంస్కృతి సంప్రదాయాలు గానీ, లేని బోయలను ఎస్‌టిల్లో ఎలా చేరుస్తారని ప్రశ్నించారు. వీరిని ఎస్‌టిల్లో చేర్చితే ఆదివాసీలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. అనేక ఇబ్బందులు పడతారన్నారు. బోయలను ఎస్‌టిల్లో చేర్చవద్దంటూ తమ సంఘంతో పాటూ ఆదివాసీ సంఘాల మద్దతుతో వినతులు కేంద్ర ప్రభుత్వ పెద్దలకు పంపనున్నామన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేకుంటే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

ప్రయోజనకరంగా బ్రిటీష్ కాలం నాటి బ్రిడ్జి

ఒడిశా వెళ్లేందుకు ఇదే ఆధారం

ప్రజాశక్తి - కొమరాడ

మండలం లోని కోటిపాం సమీపంలో 1935 మార్చి నెలలో బ్రిటీష్ వారు నిర్మించిన కట్టడం ప్రస్తుతం ఎంతో ఉపయోగకరంగా మారింది. ఈ ప్రదేశంలో ఒడిశా ప్రాంతానికి వెళ్లేందుకు అప్పట్లో బ్రిటీష్ అధికారులు, ప్రభుత్వం రాతి కట్టడం ఏర్పాటు చేయడంతో బస్సు, రైల్వే మార్గం కూడా కల్పించారు. ఒడిశాలో ఉండే విలువైన కలప, వన మూలికలు సేకరించి తెచ్చేందుకు ఈ మార్గాలు ఎంతో ఉపయోగపడేవి. ఇప్పుడు ఒడిశాలో ఉన్న జెకె, రాయగడ వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రధాన రహదారిగా మారిందని పలువురు పూర్వీకులు చెబుతున్నారు. సుమారు 80 ఏళు దాటి ఉన్న ఈ పురాతన కట్టడం నేటికీ చెక్కుచెదరకుండా ఉందంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. ప్రస్తుతం ఇది స్వల్పంగా మరమ్మతుకు గురైంది. ఇది లేకపోయినట్లయితే ఒడిశా, ఆంధ్రాకు మధ్య రాకపోకలు ఎప్పటికీ జరగవు. ఈ బ్రిడ్జిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పలువురు అంటున్నారు. ఈ ప్రాంతానికి చారిత్రక కట్టడం ఇదొక్కటే కావడం విశేషం. సంబంధిత అధికారులు స్పందించి దీనిని మరమ్మతులు చేపట్టి కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని పలువురు అంటున్నారు. బ్రిడ్జి పక్కన ఉన్న ఇనుప రాడ్లు పూర్తిగా పాడవడంతో అనేక ప్రమాదాలు గతంలో సంభవించాయి. రాడ్లు లేకపోవడంతో ప్రమాదం జరిగితే కింద నదిలోకి పడిపోయే ప్రమాదముంది. సంబంధిత అధికారులు స్పందించి దీనిని కాపాడుకోవాల్సి ఉంది.



కోటిపాం పురాతన బ్రిడ్జి ఇదే

'వెలుగు' కార్యాలయానికి ఫర్నీచర్ మంజూరు



వెలుగు కార్యాలయానికి అందజేసిన ఫర్నీచర్‌తో ఆర్‌డిఒ, సిబ్బంది

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

స్థానిక వెలుగు కార్యాలయానికి కొత్త ఫర్నీచర్ మంజూరైంది. ఈ కార్యాలయం ప్రారంభమైనప్పటి నుండి కొత్త ఫర్నీచర్ లేకపోవడంతో ఇక్కడ ఉద్యోగులతో పాటూ గ్రామాల నుంచి వచ్చే డ్వాక్రా సంఘాల సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఎట్టకేలకూ స్పందించిన సెర్ప్ అధికారులు ఈ కార్యాలయానికి కుర్చీలు, బెంచీలు, కంప్యూటర్ టేబుళ్లు, బెడ్‌సీట్లు, కంబళ్లు తదితర వస్తువులను మంజూరుచేశారు. ఈ మేరకు ఈ వస్తువులను వెలుగు సిబ్బందికి పార్వతీపురం ఆర్‌డిఒ బి.సుదర్శదొర అందిస్తూ వాటిని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెలుగు ఎపిఎం త్రినాధమ్మ, తహశీల్దార్ ఎన్‌వి రమణ, సిడిపిఒ విజయలక్ష్మి, సర్పంచి కె.కళావతి, ఎ.కుసుమమ్మ, బి.పద్మ, ఎంపిటిసి సభ్యులు సునీత, వెలుగు సీసీలు ఆనందరావు, శ్రీరాములు, బాబూరావు, ఎల్‌వి రమణ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ, డివైఎఫ్ఐ నాయకులు

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

ప్రజాశక్తి - పార్వతీపురం

నూతన సంవత్సరం వస్తుందన్న సందర్భంగా ఆనందంతో యువత మద్యం సేవించి వాహనాలు నడపొద్దని పట్టణ ఎస్ఐ ఎం.రాజేష్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ ముఖేష్ తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్టీసి కాంప్లెక్స్ ఆవరణలో డివైఎఫ్ఐ ఆధ్వర్యాన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన సంవత్సరం వస్తుందన్న ఆనందంతో అందరికీ శుభాకాంక్షలు చెప్పడం సంతోషమేనన్నారు. కానీ ఎటువంటి చెడు వ్యసనాలు చేయవద్దన్నారు. భవిష్యత్ తరాలకు నేటి యువత ఆదర్శంగా ఉండాలన్నారు. యువత చైతన్యవంతులైతేనే దేశ భవిష్యత్ బాగుంటుందన్నారు. వచ్చే ఏడాదికి ప్రతిఒక్కరూ ఒక లక్ష్యాన్ని ఎంచుకొని వాటిని సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు సిహెచ్ శివ, నాని, ప్రవీణ్, మురళీ, నవీన్, అశోక్, తేజా, రాజేష్, హేమంత్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మలుపు

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని అంతర్ రాష్ట్ర రహదారిలో ఎన్నో మలుపులు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. ఆ మలుపుల కారణంగా ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై అధికారులకు పలుసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆవేదన చెందుతున్నారు. మండలంలోని కొమరాడ, గంగరేగువలస, అర్తాం, కూనేరు, రామభద్రపురం గ్రామాల వద్ద ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా ఉన్నాయి. సంబంధిత అధికారులు మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతో అంతర్‌రాష్ట్ర రహదారి కావడంతో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు కొమరాడ శివారులో ఉన్న మలుపు వద్ద సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం ఉంది. అక్కడ హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో విద్యార్థులు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పలువురు వాపోతున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో మలుపుల వద్ద మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.



కొమరాడ శివారులో ప్రమాదకరంగా ఉన్న మలుపు

ప్రభుత్వ వైద్య కళాశాల, గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేయాలి

ఎస్ఎఫ్ఐ 26వ జిల్లా మహాసభ డిమాండ్

జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా రాజశేఖర్, సురేష్ ఏకగ్రీవంగా ఎన్నిక

26 మందితో నూతన కమిటీ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వ వైద్య కళాశాలను, గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ 26వ జిల్లా మహాసభ డిమాండ్ చేసింది. ఆదివారంతో జిల్లా మహాసభలు ముగిశాయి. మహాసభలో పలు తీర్మానాలను ఆమోదించారు. అనంతరం స్థానిక యువజన వసతిగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కొత్తగా ఎంపికైన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి రాజశేఖర్, కె.సురేష్ మాట్లాడారు. జిల్లా మహాసభల్లో కాలేజీ హాస్టళ్లకు రూ.2వేలు, స్కూల్ హాస్టళ్లకు రూ.1500 మెస్‌ఛార్జీలు పెంచాలని, జిల్లా కేంద్రంలో డిగ్రీ కాలేజీ మంజూరు చేయాలని, మహిళా జూనియర్, డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేయాలని తీర్మానించామన్నారు. బొబ్బిలిలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పార్వతీపురం, కొత్తవలసలో డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. చీపురుపల్లి, గుమ్మలక్ష్మీపురం, పూసపాటిరేగ కళాశాలల్లో రెగ్యులర్ అధ్యాపకులను నియమించాలని, సాలూరు, చీపురుపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలకు క్రీడాపరికరాలను అందించి, వ్యాయామ ఉపాధ్యాయులను నియమించాలని తీర్మానించామన్నారు. ఎయిడెడ్ కాలేజీల్లో జీవో 25ను రద్దుచేసి, అనుబంధ హాస్టళ్లకు ప్రభుత్వం పెంచిన స్కాలర్‌షిప్‌లను వర్తింపచేయాలని కోరారు. పూసాపాటిరేగ, గంట్యాడ, పాచిపెంట, కొత్తవలస, బాడంగి, కురుపాం, కొమరాడ, పార్వతీపురం, గుమ్మలక్ష్మీపురం జూనియర్ కాలేజీల భవనాలను మరమ్మతులు చేయాలని, కస్తూరిబా, గురుకులాల్లో నాణ్యమైన భోజనాలు, మౌలిక సదుపాయాలను కల్పించాలని, విద్యార్థినులపై జరుగుతున్న దాడుల నివారణకు పటిష్టచర్యలు తీసుకోవాలని, అన్ని కాలేజీ హాస్టళ్లలో విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు ఇవ్వాలని, హాస్టళ్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని మహాసభలో తీర్మానించామని తెలిపారు. అనంతరం మహాసభల్లో 25 మందితో నూతనజిల్లా కమిటీ ఎన్నికైంది. రానున్న కాలంలో ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ ఉద్యమాన్ని మరింతబలోపేతం చేస్తామని తెలిపారు.



కొత్తగా ఎన్నికైన ఎస్ఎఫ్ఐ కార్యవర్గం

26మందితో నూతన జిల్లా కమిటీ

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.అశోక్ పర్యవేక్షణలో జిల్లా నూతన కమిటీని ఎన్నికైంది. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా పి.రాజశేఖర్, కె.సురేష్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పి.రామ్మోహన్, పి. శ్రీను, సహాయ కార్యదర్శులుగా ఎ.సురేష్, ఎం.చింతయ్య, కోశాధికారిగా జి.జగపతిబాబుతో పాటు 16మందిని జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.


జయంతి సభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మహిళా ఉపాధ్యాయులు

'సావిత్రిభాయిపూలే జయంతి సభలను విజయవంతం చేయాలి'

ప్రజాశక్తి-విజయనగరం

సావిత్రిభాయి పూలే జయంతి వేడుకలను జనవరి 3 నుంచి 7 వరకు విజయవంతంగా నిర్వహించాలని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.విజయగౌరి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ మినిస్టీరియల్ హాలులో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు జి.నిర్మల అధ్యక్షతన మహిళా విభాగం ఆధ్వర్యాన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విజయగౌరి మాట్లాడుతూ విద్యారంగంలో పరిణామాలన్నింటినీ మహిళా టీచర్లు ఎప్పటికప్పుడు అవగాహన చేసుకోవాల న్నారు. రాష్ట్రంలో 44 శాతం గల మహిళా టీచర్లు ఉద్యమాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. ప్రధానంగా మహిళా టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలపైనా, బాలికా విద్యాభివృద్ధికి ఆటంకాలకు గల విధానాలను ప్రతిఘటించాలన్నారు. డిటెన్షన్ విధానం, పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్ పేరుతో విద్యా రంగాన్ని ప్రైవేటుపరం చేసే అంశాలను, సెల్ఫ్ ఫైనార్సు యాక్టును తీసుకొచ్చి విద్యను కార్పొరేటీకరించడం వంటివి బాలిక లను విద్యకు దూరం చేసేవిగా ఉన్నాయని విమర్శించారు. వీటిని ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎంపి వాగ్దేవి మాట్లాడుతూ మహిళా టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై యుటిఎఫ్ క్యాంపెయిన్ చేస్తుందని, సావిత్రిభాయిపూలే జయంతి సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సావిత్రిబాయి పూలే జయంతికి సంబంధించిన కరపత్రాలను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మహిళా విభాగం నూతన కమిటీని ఎన్ను కున్నారు. కన్వీనర్ రాధా భవానీ, కో-కన్వీనర్లు మాధవీలత, శ్రీదేవి, జైనాభీ, సభ్యులుగా సుజాత, శశికళ, రాజామణి, రామలక్ష్మి అన్ని మండలాల సహాధ్యక్షులు కమిటీ సభ్యులుగా ఉన్నారు. కార్యక్ర మంలో రాష్ట్రకార్యదర్శి రాము, గౌరవాధ్యక్షులు ఎ.శివవర్మ, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి శ్రీనివాస రావు, కె.శేషగిరి, కోశాధికారి రమేష్ పట్నాయక్, జిల్లా కార్యదర్శి జి.పార్వతి, జెవిఆర్‌కె ఈశ్వరరావు, మండల నాయకులు కృష్ణంనాయుడు, శ్రీదేవి, శశికళ, జైనాభీ, మాధవీలత, తపాల్గొన్నారు.